
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
****
నల్లగొండ
5
శనివారం 3 మే 2025



హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్	18005728980
నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.162	240	270
సూర్యాపేట	రూ.165	220	250
నల్లగొండ	రూ.155	215	240

ఉష్ణోగ్రత గరిష్ఠం 41.0 | కనిష్ఠం 24.0



బత్తాయి ధర పతనం

» బత్తాయి టన్ను రూ.18వేలు » చరిత్రలో ఇదే మొదటి సారి » సాగులోనూ కష్టాలు » ఆందోళనలో రైతాంగం



ఈ రైతు పేరు కరణం మల్లిఖార్జున్. అనుముల మండలం హాలియా గ్రామంలో 15 ఏళ్లుగా 10 ఎకరాల్లో బత్తాయి సాగు చేస్తున్నాడు. ఒకప్పుడు బత్తా యి సాగు వ్యయం తక్కువగా ఉండగా, దిగుబడి బాగా వచ్చేది. దీంతో ఆదాయం కూడా బాగానే ఉండే ది. ఐదేళ్లుగా వాతావరణంలో మార్పుల కారణంగా మం గునల్లి వంటి తెగుళ్ల వ్యాప్తి అధికమై దిగుబడులు బాగా తగ్గాయి. ఎకరానికి సాధారణంగా 10 టన్నుల దిగుబడులు వచ్చేది. ప్రస్తుతం కత్తెర కాయ టన్నుకు మించి కూడా దిగుబడి రావడం లేదు. సీజన్‌లో ఐదు టన్నుల దిగుబడి రావడం కష్టంగా మారింది. ఎకరానికి రూ.50వేలకు పైన పెట్టుబడులు పెట్టాల్సి వస్తోంది. దిగుబడులు తక్కువగా వస్తున్న నేపథ్యంలోనే ధరలు కూడా బాగా పడిపోయాయి. ఏటా కత్తెర కాయ టన్నుకు కనీసం రూ.40వేల నుంచి రూ.50వేల వరకు ధర పలికేది. ప్రస్తుతం రూ.18వేలకు ఎవరూ కొనుగోలు చేయడం లేదు. సీజన్ కాయ ఆశించిన స్థాయిలో లేదు. ఈ ఏడాది కనీసం పెట్టుబడులు కూడా వచ్చేది కష్టంగా మారింది. దీంతో బత్తాయి సాగు నష్టం మిగులుస్తోందని రైతు వాపోతున్నాడు.

బత్తాయికి గడ్డుకాలం ఏర్పడింది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా బత్తాయి ధర పతనమైంది. ఏటా భారీగా బత్తాయి సాగు విస్తీర్ణం పడి పోతుండగా, అదే స్థాయిలో ధరలు తగ్గడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. సాగు ఖర్చులు పెరగడంతో పాటు ప్రతికూల వాతావరణ ప్రభావంతో తెగుళ్ల వ్యాప్తి రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.

-(ఆంధ్రజ్యోతి,మిర్యాలగూడ వ్యవసాయం)

బత్తాయి సాగులో రెండు దశాబ్దాలుగా వేసవిలో వచ్చే కత్తెర కాయకు ఎనలేని డిమాండ్ ఉండేది. సాధారణంగా కత్తెర కాయ దిగుబడి చాలా తక్కువగా వస్తుంది. జ్యూస్ వినియోగం అధికంగా ఉండటం, కాయ దిగుబడి తక్కువగా ఉండటంతో డిమాండ్ అధికంగా ఉంటుంది. ఏప్రిల్-మే నెలలో సాధారణంగా టన్ను బత్తాయికి రూ.40వేల నుంచి రూ.50వేల వరకు ధర పలుకుతుం ది. ప్రస్తుతం టన్నుకు రూ.18వేలకు మించి ధర లేదు. ఇక్కడి బత్తాయి ఉత్తర భారతదేశంలోని ఢిల్లీ, ఆగ్రా, జైపూర్, కలకత్తా, ముంబై తదితర ప్రాంతాలకు ఎగుమతి అవుతుంది. అక్కడ అకాల వర్షాలు పడుతుండటంతో పాటు కాయ వినియోగం పడిపోయిందని వ్యాపారులు చెబుతున్నారు.

రాయలసీమ ఎఫెక్ట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాయలసీమ

మిగతా 7వ పేజీలో...

ప్రోత్సాహం ఏదీ?

తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో సాగయ్యే బత్తాయికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరువైంది. స్థానికంగా మార్కెట్ ఏర్పాటు చేయకపోవడంతో పాటు సబ్సిడీలు అందించకపోవడం, సాగు యాజమాన్య పద్ధతులపై సరైన సూచనలు కరువయ్యాని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బత్తాయికి బీమా వర్తింపజేయకపోవడంతో ఉమ్మడి జిల్లాలో తోటలు అంతరించే దశలో ఉన్నాయి.

సాగు దుర్భరం

జిల్లాలో సుమారు 40వేల ఎకరాల్లో బత్తాయి సాగు ఉందని ఉద్యానశాఖ అధికారుల గణాంకాలు వెల్లడిస్తుండగా, 20వేలకు మించి సాగు ఉండదని తెలుస్తోంది. బత్తాయిలో రెండేళ్లుగా కత్తెర కాయ దిగుబడులు రావడం లేదు. సెప్టెంబరు-అక్టోబరులో చెట్లు వాడు పెడితేనే కత్తెర కాయ దిగుబడులు వస్తాయి. రెండేళ్లుగా ఈ సమయంలో వర్షాలు పడుతుండటంతో దిగుబడులు పూర్తి స్థాయిలో పడిపోయాయి. చాలా ప్రాంతాల్లో 10 ఎకరాలకు 2టన్నుల నుంచి 3టన్నులు దిగుబడులు రాలేదని రైతులు వాపోతున్నారు. వచ్చిన కొద్ది కాయకు విపరీతమైన మంగు ఉంది. కాండాలకు పచ్చని పాకురు, వేరుకుళ్లు, పూత దశలో తామర పురుగులు, త్రిప్స్ వస్తుండటంతో చెట్లు చనిపోతున్నాయి. పెట్టుబడులు పెడుతున్నా చెట్లు కోలుకోవడం లేదు.



లష్కర్, హెల్పర్ల నియామకాలకు కసరత్తు

నీటిపారుదలశాఖ నల్లగొండ డివిజన్ పరిధిలో లష్కర్లు, హెల్పర్ల నియామకాల కోసం కసరత్తు సాగుతోంది. ఈ ఉద్యోగాలను ఔట్‌సోర్స్ ద్వారా నియమించాలని నీటిపారుదలశాఖ నిర్ణయించడంతో ఔట్‌సోర్స్ ఏజెన్సీలను ఎంపికచేసే ప్రక్రియ ప్రారంభమైంది. నల్లగొండ జిల్లా ఉపాధికల్పన కార్యాలయంలో ఎంప్యానల్ అయిన ఔట్‌సోర్స్ ఏజెన్సీల నుంచి గత నెల 19వ తేదీ వరకు దరఖాస్తులు తీసుకున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

» ఔట్‌సోర్స్ ఏజెన్సీ ఎంపికకు లాటరీ
» కాంట్రాక్ట్ కోసం 62 ఏజెన్సీల దరఖాస్తు
» దక్కించుకునేందుకు తెరవెనుక ప్రయత్నాలు
» నామినేటెడ్‌కు నో చెప్పిన ఉన్నతాధికారులు
» నిరుద్యోగులు మోసపోవద్దు : జిల్లా ఉపాధికల్పనాధికారి పద్మ

జిల్లాలో 97 ఏజెన్సీలు ఉండగా, 62 ఏజెన్సీలు దరఖాస్తు చేసుకున్నాయి. నోటిఫికేషన్ ద్వారా ఎంపికయ్యే ఏజెన్సీ నుంచి 229 లష్కర్ పోస్టులు, ఆరు హెల్పర్ల పోస్టుల నియామకాలు చేపట్టనుండడంతో ఈ కాంట్రాక్ట్ కోసం ఏజెన్సీలు తెరవెనక ప్రయత్నాలు సైతం చేస్తున్నట్లు తెలిసింది. అయితే ఏజెన్సీల ఎంపికను లాటరీ ద్వారా చేపట్టాలని ఎంప్యానల్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరించే కలెక్టర్ నిర్ణయించడంతో, లాటరీ ప్రక్రియ కోసం దరఖాస్తు చేసుకున్న ఏజెన్సీలు అందుకు ఎదురుచూస్తున్నాయి. మరోవైపున ఏజెన్సీ ఇంకా ఖరారు కాకపోయినా నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో ఈ ఉద్యోగాల కోసం నేరుగా సీఈ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటుండగా, మరికొందరు రాజకీయనేతల చుట్టూ పైరవీల కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు.

లాటరీ కోసం ఏజెన్సీల ఎదురుచూపు

లష్కర్, హెల్పర్ ఉద్యోగాల నియామక, నిర్వహణ బాధ్యతలుండే ఏజెన్సీని ఎంపికచేసే లాటరీ ప్రక్రియ కోసం ఏజెన్సీల నిర్వాహకులు ఎదురుచూస్తున్నారు. అదనపు కలెక్టర్‌కు ఈ బాధ్యతలను అప్పగించడం, ఆయన సెలవులో ఉండడంతో ఇన్‌చార్జిగా ఉన్న మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ సమక్షంలో ఉపాధికల్పన అధికారి ఈ లాటరీ నిర్వహించనున్నారు. అందుకోసం ఇంకా తేదీ ఖరారు కాలేదు. లాటరీ నిర్వహించే తేదీని నిర్ణయించిన తర్వాత కలెక్టర్ అనుమతితో దరఖాస్తు చేసుకున్న ఏజెన్సీలకు సమాచారం ఇస్తారు. లాటరీలో ప్రాధాన్యక్రమంలో ఐదు ఏజెన్సీలను ఎంపిక చేస్తారు. ఎంపికైన ఏజెన్సీకి లేబర్ లైసెన్స్‌తో పాటు ఇతర అర్హతలున్నాయా? లేదా? అనే అంశాన్ని పరిశీలిస్తారు. అంతేకాకుండా ఎంపికైన ఏజెన్సీ పీఎఫ్ గతంలో నిర్వహించిన కాంట్రాక్ట్‌లకు సంబంధించిన ఎంప్లాయర్స్ నుంచి నో డ్యూస్, క్లియరెన్స్ సర్టిఫికెట్లు సమర్పించాల్సి ఉంటుంది. డిఫాల్టర్ అయితే సంబంధిత ఏజెన్సీకి ఈ కాంట్రాక్ట్ ఇవ్వకుండా తప్పించి, తదుపరి ఉన్న ఏజెన్సీని పరిశీలిస్తారు. ఇలా పూర్తి పారదర్శకంగా ఏజెన్సీని ఎంపికచేసే ప్రక్రియ కొనసాగించాలని ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు తెలిసింది. నామినేటెడ్‌పై ఏజెన్సీలకు కాంట్రాక్ట్‌లు ఇస్తే కాంట్రాక్ట్ రాని ఏజెన్సీలు కోర్టులను ఆశ్రయించడం వంటి కారణాలతో ఇబ్బందులు వస్తున్న నేపథ్యంలో పూర్తిపారదర్శకంగా ఉండేందుకే లాటరీ విధానాన్ని తీసుకున్నట్టు అధికారులు చెబుతున్నారు.

ఏజెన్సీని దక్కించుకునేందుకు తెరవెనక ప్రయత్నాలు

కీలకమైన నీటిపారుదలశాఖలో ఔట్‌సోర్స్ కాంట్రాక్ట్ కావడంతో దీన్ని దక్కించుకునేందుకు ఏజెన్సీల నిర్వాహకులు కొందరు తెరవెనక ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇతర జిల్లాల్లో మాదిరిగా నామినేటెడ్ పద్ధతిలో ఏజెన్సీని ఎంపికచేయాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు. ఇందుకోసం కీలక ప్రజాప్రతినిధుల ద్వారా పైరవీలు ప్రారంభించారు. ఏజెన్సీని ఇప్పిస్తే, ఉద్యోగాలు ఆశించే అభ్యర్థుల నుంచి డబ్బు వసూలు చేసి అందులో సగం వరకు కాంట్రాక్ట్ ఇప్పించేవారికి ఇస్తామని సదరు ఏజెన్సీల నిర్వాహకులు కీలకమైన ప్రజాప్రతినిధులను ఆశ్రయించినట్లు తెలిసింది. అయితే కలెక్టర్ సహా ఉన్నతాధికారులు పూర్తి పారదర్శకంగా లాటరీ ద్వారా ఏజెన్సీని ఎంపిక చేస్తామని తేల్చి చెప్పడంతో పాటు, టాప్ ప్రయార్టీలో ఏజెన్సీలను ఎంపికచేసి, అన్ని అర్హతలున్నాకే బాధ్యతలిస్తామని చెబుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. అంతేకాకుండా ఉద్యోగాలు ఆశించే నిరుద్యోగులు ఎవరూ ఎలాంటి ప్రలోభాలకు లొంగవద్దని, ఏజెన్సీని ఎంపికచేశాకే ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ ఇస్తామని స్పష్టం చేస్తున్నారు. దీంతో ఏజెన్సీని ఎలాగైనా దక్కించుకోవాలనే నిర్వాహకులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

ఏజెన్సీని ఎంపిక చేశాకే ఉద్యోగాల కోసం నోటిఫికేషన్

తాజా నోటిఫికేషన్ ప్రకారం లష్కర్, హెల్పర్ల ఉద్యోగాలకు ఏజెన్సీ నియామకం పూర్తయ్యాకే ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ ఇస్తారు. ఆ నోటిఫికేషన్‌లో సూచించిన ప్రకారమే ఉద్యోగాలకు అభ్యర్థులు దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది. ఈ విషయంపై అవగాహన లేకపోవడంతో పలువురు నిరుద్యోగులు, అర్హులైన వారు ఉద్యోగాల కోసం ఇప్పటికే నీటిపారుదలశాఖ డివిజన్ కార్యాలయంలో దరఖాస్తులు ఇస్తున్న పరిస్థితి నెలకొంది.

పారదర్శకంగా ఏజెన్సీల ఎంపిక

- పద్మ, జిల్లా ఉపాధికల్పనా అధికారి

నల్లగొండ జిల్లాలోని నీటిపారుదలశాఖ సీఈ కార్యాలయ పరిధిలో లష్కర్, హెల్పర్ ఉద్యోగాల నిర్వహణకు ఔట్‌సోర్స్ ఏజెన్సీని పారదర్శకం గా ఎంపిక చేస్తాం. జీవో ప్రకారం ఎంపిక ప్రక్రి య ఉండాలనే ఉద్దేశంతో కలెక్టర్ సూచనలమేరకు లాటరీ విధానం ఉంటుందని నోటిఫికేషన్ ఇచ్చాం. 62 ఏజెన్సీలు దరఖాస్తు చేసుకున్నా యి. కలెక్టర్ నిర్ణయించిన తేదీ ప్రకారం లాటరీ తేదీని తెలియజేస్తాం. లాటరీలో ఎంపికైన ఏజెన్సీకి సంబంధించి అన్ని పత్రాలు, నోడ్యూస్ సర్టిఫికెట్లు, డిఫాల్టర్ అయితే ఆ విషయా లన్నింటినీ పరిశీలించిన తర్వాతే ఏజెన్సీని ఖరారు చేస్తాం. లాటరీలో ఎంపికైనా, అనర్హులైతే తదుపరి వచ్చేవారికి అవకాశం కల్పిస్తాం. ఎక్కడా తప్పులకు, పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఎంపికచేస్తాం. ఏజెన్సీ ఖరారయ్యాక ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ విడుదల చేస్తాం. దాని ప్రకారమే నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలి. ఉద్యోగాల ఎంపిక కూడా నిబంధనల ప్రకారమే జరుగుతుంది. మాయమాటలు నమ్మి నిరుద్యోగులు మోసపోవద్దు.

లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టాలి

రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ప్రతీ నియోజకవర్గానికి కేటాయించిన 3,500 ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేపట్టాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. లబ్ధిదారుల ఎంపిక ఎంతవరకు పూర్తయితే అంతవరకు ఏరోజుకారోజు ఇన్‌చార్జి మంత్రుల నుంచి జాబితాకు ఆమోదం తీసుకోవాలని, ప్రతీ నియోజకవర్గంలోని పట్టణ ప్రాంతాలకు 500 కనీసం ఇళ్లను కేటాయించాలన్నారు. ఇంటి నిర్మాణం 400చదరపు అడుగులకు తగ్గకుండా 600 చదరపు అడుగులకు మించకుండా ఉండేలా కలెక్టర్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జాబితాలో ఎవరైనా అనర్హులని తేలితే ఇళ్ల నిర్మాణం మధ్యలో ఉన్నా రద్దు చేస్తామన్నారు. గత నెల 17 నుంచి 30వ తేదీ వరకు నాలుగు పైలెట్ మండలాల్లో నిర్వహించిన మాదిరిగానే ఈనెల 5 నుంచి 20వ తేదీ వరకు జిల్లాకో మండలం చొప్పున రెవెన్యూ సదస్సులు నిర్వహించాలన్నారు. ప్రతీ మండలానికి రెండు బృందాలను ఏర్పాటు చేయాలని, స్థానిక తహసీల్దార్‌తో ఒక బృందం, మరో తహసీల్దార్‌తో ఇంకో బృందం ఏర్పాటు చేయాలన్నారు. ఈ బృందాలు గ్రామంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సదస్సులు నిర్వహించాలన్నారు. గ్రామస్థులకు ముందుగానే దరఖాస్తులు అందజేయాలన్నారు. రికార్డులన్నింటినీ బృందాలు వెంట తీసుకువెళ్లాలన్నారు. అలాగే హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పైలట్ మండలాల్లో వచ్చిన దరఖాస్తులను ఈనెల 31వ తేదీవరకు పరిష్కరించాలని, పరిష్కారం కాని వాటికి ఎందుకు పరిష్కరించడం లేదనే విషయాన్ని లిఖిత పూర్వకంగా తెలియజేస్తూ దరఖాస్తును తిరస్కరించాలని సూచించారు. ప్రభుత్వ భూముల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమో దు చేయాలని, అసైన్డ్‌ల్యాండ్‌కు సంబంధించి పొజిషన్ మీద ఉండి పట్టా లేనివారు, పట్టా ఉండి పొజిషన్ మీద లేనివారి వివరాలను సేకరించాలన్నారు. వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్లు నారాయణ్‌అమిత్, రాజ్‌కుమార్, అదనపు ఎస్పీ రమేష్, ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

'నీట్'కు ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్

జిల్లాలో ఈ నెల 4న నిర్వహించనున్న నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్)కు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నీట్ కోసం జిల్లా కేంద్రంలో ఏడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షకు 2,087 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. ఎంజీ యూనివర్సిటీలో నాలుగు పరీక్షా కేంద్రాలు, ఎన్జీ కళాశాల, ఉమెన్స్ డిగ్రీ కళాశాల, కేంద్రీయ విద్యాలయంలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష రాసే అభ్యర్థులు ఒకరోజు ముందుగానే పరీక్షా కేంద్రాలను చూసుకోవాలన్నారు. ఈ నెల 4న మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్ష ఉంటుందని, అభ్యర్థులు ఉదయం 11 గంటలకే కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అభ్యర్థుల బయోమెట్రిక్ అటెండెన్స్ తీసుకుంటామని, మధ్యాహ్నం 1.30గంటలకు పరీక్షా కేంద్రం గేట్లు మూసివేస్తామన్నారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డు, ఇటీవలి దిగిన ఒక పాస్‌పోర్ట్ సైజ్ కలర్ ఫొటో, మరో పోస్ట్‌కార్డ్ సైజ్ కలర్ ఫొటోతో రావాలని తెలిపారు. ఏదైనా ఒక గుర్తింపుకార్డు తీసుకురావాలన్నారు. పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశాని, పరీక్ష సమయంలో జిరాక్స్ కేంద్రాల మూసివేత, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 163వ సెక్షన్ విధిస్తామన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 18004251442కు ఫోన్ చేయాలని సూచించారు.

ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌ను ఖాళీ చేస్తారా?



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

» మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు
» కళాభారతికి కేసీఆర్ పేరును తొలగించినందుకు నిరసన

మిర్యాలగూడ, మే 2(ఆంధ్రజ్యోతి): కళాభారతికి కేసీఆర్ పేరు తొలగించినట్లే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన క్యాంప్ ఆఫీస్‌ను ఎమ్మెల్యే ఖాళీ చేస్తారా అని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ప్రశ్నించారు. ఎన్నెస్పీ క్యాంపులో నిర్మించిన మినీ రవీంద్రభారతికి బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ కళాభారతిగా నామకరణం చేయగా, కేసీఆర్ పేరును తొలగించడంతో శుక్రవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ, కళాభారతి ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడుతూ, రూ.10కోట్లు మంజూరు చేయించి కళాభారతిని నిర్మించి తెలంగాణ ప్రజల ఆత్మ కేసీఆర్ పేరుపెడితే మున్సిపాలిటీలో తీర్మాణం, జీవో లేదనే సాకుతో పేరును తొలగించడం సరికాదన్నారు. తిప్పన విజయసింహారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎన్నెస్పీ క్యాంప్ గ్రౌండ్‌కు రాజీవ్‌స్టేడియంగా నామకరణం చేశారని, జూలకంటి రంగారెడ్డి కాలంలో సుందరయ్య పార్క్ నిర్మాణం చేశారని, నచ్చకపోతే పేరు మారుస్తారా అని ప్రశ్నించారు. మిర్యాలగూడకు పిడుగురాళ్ల అని పేరు పెట్టి పిలుచుకోండని వ్యంగ్యంగా అన్నారు. పనులు చేసిన వారి పేరును చెరిపివేయడం కాదని, కొత్త పనులు చేసి నచ్చినవారి పేరు పెట్టుకోవాలని సూచించారు. అధికార రాజకీయ నాయకులకు భయపడి అధికారులు తప్పుడు విధానాలకు పాల్పడితే వారే శిక్షను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. వెంటనే అధికారులు కేసీఆర్ పేరును తిరిగి పెట్టాలని, లేనిపక్షంలో ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. రూ.30వేల కోట్లతో తెచ్చిన యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ నిర్వాసితులకు 573 మందికి ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా 116 మందికి కూడా ఇప్పించలేకపోయారని విమర్శించారు. పవర్‌ప్లాంట్‌లో ఓ అవినీతి అధికారి అండతో కోట్ల రూపాయల సామగ్రి తరలిపోగా, ఆ అధికారిపై తాను ఫిర్యాదు చేస్తే ప్లాంట్‌నుంచి బదిలీ చేశారని అన్నారు. అనంతరం మునిసిపల్ కమిషనర్, సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, నాయకులు చింతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దుర్గంపూడి నారాయణరెడ్డి, ఎండి.మోసిన్‌అలీ, దానావత్ చిట్టిబాబునాయక్, మట్టపల్లి సైదయ్య, బైరం సంపత్, ఎండి.ఇలియాస్‌ఖాన్, రాములుగౌడ్, కుర్ర చైతన్య, పెండ్యాల పద్మ, షెహనాజ్ బేగం, కోదాటి రమా, ధనమ్మ, ఉమ, ఎండి.షోయబ్, తిరందాసు విష్ణు, మాజీద్, తదితరులు పాల్గొన్నారు.

చేనేత రంగానికి రూ.290 కోట్లు

» భూదాన్‌పోచంపల్లిలోని 'చేనేత సదస్సు'లో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



భూదాన్‌పోచంపల్లిలోని 'పోచంపల్లి ఇక్కత్ పరిశ్రమపై చేనేత సదస్సు'కు హాజరై మాట్లాడుతున్న రాష్ట్ర చేనేత, జౌళీశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత రంగాన్ని ప్రోత్సహించేందుకు రూ.290కోట్ల నిధులు పొదుపు పథకానికి విడుదల చేసిందని, చేనేత కార్మికులను ఆదుకునేందుకు రూ.75వేల నుంచి రూ.1.50లక్షల వరకు రుణాలు పొందే అవకాశం కల్పిస్తుందని చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం యాదాద్రి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణంలో పోచంపల్లి ఇక్కత్ పరిశ్రమపై 'చేనేత సదస్సు' స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో మంత్రి తుమ్మల మాట్లాడుతూ, రాష్ట్రంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చేనేతరంగం నిర్వీర్యమైందన్నారు. సంక్షోభంలో ఉన్న చేనేత రంగాన్ని పరిరక్షించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ వస్త్రాలు డూప్లికేట్ కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమశాఖల ద్వారా యూనిఫామ్ మెటీరియల్‌ను కొనుగోలు చేయిస్తామన్నారు. ఈ నెల 15న ప్రపంచ సుందరీమణులు భూదాన్‌పోచంపల్లిలో సందడి చేయనున్నారన్నారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరిట అవార్డులు కొనసాగిస్తామన్నారు. చేనేత, జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ మాట్లాడుతూ ప్రతీ చేనేత కార్మికుడికి రూ.18 వేలు, అనుబంధ కార్మికుడికి రూ.6వేలు జమ చేసే పద్ధతి వచ్చేనెల నుంచి అమల్లోకి వస్తుందన్నారు. సదస్సులో నాయకులు తడక వెంకటేష్, మురళీ మదన్‌గోపాల్ స్వామి, రేఖ బాబురావు, భారత లవకుమార్, గర్దాసు బాలయ్య, తడక రమేష్, పాల్గొన్నారు.

• ఈదురుగాలుల బీభత్సం



కొండమల్లేపల్లిలో ఈదురుగాలులకు కూలిన కారుపై కూలిన చెట్టు

• 6లో..

కులగణనపై కేంద్ర నిర్ణయం చరిత్రాత్మకం

రామగిరి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కులగణనపై కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకోవడం చరిత్రాత్మకమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక గడియారం సెంటర్‌లో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో ప్రధాని నరెంద్ర మోదీ ఆధ్వర్యంలో తీసుకున్న నిర్ణయం బీసీలకు ఉపయోగకరమైనదన్నారు. 60 ఏళ్ల పాలించిన కాంగ్రెస్ బీసీల సంక్షేమంపై ఆలోచన చేయకపోవడంతో పాటు అణగదొక్కే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, నాయకులు వీరెల్లి చంద్రశేఖర్, పిల్లి రామరాజు యాదవ్, చింత ముత్యాల్‌రావు, పక్కీర్ మోహన్‌రెడ్డి, పిట్టల శ్రీనివాస్, ఏరుకొండ హరి, మిరియాల వెంకటేశం, దాయం భూపాల్‌రెడ్డి, బిపంగి జగ్జీవన్‌రామ్, పాల్గొన్నారు.



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

విద్యాసదస్సును విజయవంతం చేయాలి

మట్టి మనుషుల వేదిక కన్వీనర్ వేనేపల్లి

మిర్యాలగూడ, మే 2(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడలో ఈ నెల 3వ తేదీన నిర్వహించే సామాజిక విద్యాసదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ మట్టి మనుషుల వేదిక కన్వీనర్ వేనేపల్లి పాండురంగారావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పిల్లలు మానసికంగా ఒత్తిడికి గురికాకుండా, బట్టీ చదువులకు దూరంగా, పసితనం పోగొట్టుకోకుండా పనితనం, సృజన, నైపుణ్యాలు నేర్చుకోవడం ఎలా అనే అంశంపై ఈ సదస్సు ఉంటుందన్నారు. శనివారం సాయంత్రం 3 గంటలకు వైష్ణవీ గ్రాండ్‌లో నిర్వహించే ఈ సదస్సుకు సామాజిక, విద్యావేత్త వాసిరెడ్డి అమర్‌నాథ్ హాజరవుతారని తెలిపారు.

ఈదురుగాలుల బీభత్సం




భువనగిరిలో ఈదురుగాలులకు దెబ్బతిన్న ఇంటి పైకప్పు రేకులు, రహదారికి అడ్డంగా పడిన చెట్లను తొలగిస్తున్న మునిసిపల్ రెస్క్యూ సిబ్బంది

భువనగిరి టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం భువనగిరి పట్టణంలో సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. సుమారు గంటకు 40 కిలోమీటర్ల వేగంతో వీచిన గాలులతో పట్టణంలో పలు ప్రాంతాల్లో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. స్తంభాలు ఒకవైపుకు ఒరిగాయి. దీంతో పట్టణంలో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచింది. రోడ్డుకు అడ్డంగా చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. పలు గృహాలు, డబ్బా దుకాణాల పైకప్పు రేకులు గాలికి ఎగిరి పడ్డాయి. కొన్ని బస్తీల్లో వడగండ్లు కురవడంతో ప్రజలు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. రహదారులు, మురికికాలువలు, లోతట్టు ప్రాతాలు వరద నీటితో నిండాయి. మునిసిపల్ రెస్క్యూ టీమ్‌లు రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్లను తొలగించాయి. వరద నీటి ప్రవాహం వెళ్లేలా మురికి కాల్వలను శుభ్రం చేశారు. ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులను చేపట్టారు.

తుర్కపల్లి : తుర్కపల్లి మండల కేంద్రంతో పాటు దత్తాయపల్లి, వేలుపల్లి, మాధాపూర్, వీరారెడిపల్లి, తిర్మాలాపూర్, వాసాలమర్రి తదితర గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం భారీ ఈదురు గాలులతో కూడిన వర్షానికి అన్నదాతలకు, మామిడి తోట యాజమానులకు భారీ నష్టం వాటిల్లింది. పంట చేతి కొచ్చే సమయంలో వడగళ్ల వర్షం రైతులకు కన్నీరు మిగిల్చింది. భారీ ఈదురు గాలులకు తోటల్లో కాయలు పూర్తిగా రాలిపోవడంతో తీవ్రనష్టం వాటిల్లింది. ప్రధానంగా పలుగ్రామాల్లో భారీ ఈదురుగాలులతో కూడిన వడగండ్లు పడ్డాయి. కచ్చకాయ పరిమాణంలో వడగండ్లు పడడంతో రెండు, మూడు రోజుల్లో చేతికొచ్చే పంట దెబ్బతిని రైతులకు భారీగా నష్టం వాటిల్లింది. సాగు కోసం పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశులు వర్షానికి తడిసి ముద్దయ్యాయి.

గౌరాయిపల్లిలో పిడుగు పాటుకు ఆవు మృతి...

యాదగిరిగుట్ట రూరల్:యాదగిరిగుట్ట మండలంలోని గౌరాయిపల్లి గ్రామంలో పిడుగుపాటుకు భైర శ్రీనివాస్‌కు చెందిన ఆవు మృతి చెందింది. సుమారు రూ.70వేల నష్టం వాటిల్లిందని రైతు తెలిపారు. పాడుఆవు మీద ఆధారపడి జీవిస్తున్న రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని గ్రామస్థులు కోరారు. అదే విధంగా గుట్ట పట్టణంలో సుమారు గంటసేపు భారీవర్షం కురిసింది.

కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

దేవరకొండ/కొండమల్లేపల్లి/చింతపల్లి : నల్లగొండ జిల్లా దేవరకొండ, కొండమల్లేపల్లి మండలాల్లో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దేవరకొండలో ఈదురు గాలులతో కూడిన వర్షానికి విద్యుత్ సరఫరా నిలిచింది. కొండమల్లేపల్లిలో ఈదురుగాలులతో కూడిన వర్షానికి నల్లగొండ రోడ్డు పాత ఊరిలో 33కేవీ విద్యుత్ స్తంభం కూలీ ఇంటిపై పడింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. చెట్లు విరిగి ఇళ్లపై పడ్డాయి. ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. వరి పంట చేతికి వచ్చే సమయానికి వర్షాలు పడుతుండటంతో రైతులు, ఈదురుగాలులతో కూడిన వర్షం కురుస్తుండడంతో మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. కూలిన విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు నిర్వహించి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలని కొండమల్లేపల్లి కాలనీవాసులు విద్యుత్ అధికారులను కోరుతున్నారు. అదేవిధంగా చింతపల్లి మండలంలోని ఎం.మల్లేపల్లి, ఉమ్మాపురం, సాయిరెడ్డిగూగెం, కుర్మపల్లి, పి.కే.మల్లేపల్లి, వింజమూర్, తక్కళ్లపల్లిలో ఉరుములతో కూడిన రాళ్ల వర్షం కురిసింది.

పెద్దఅడిశర్లపల్లి : పెద్దఅడిశర్లపల్లి మండలంలో శుక్రవారం సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన వర్షం పడింది. స్థానిక పీఏసీఎస్ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యంపై కప్పిన పట్టాలు ఎగిరిపోయి ధాన్యం తడిసింది. కొట్టాలగడ్డ గ్రామంలో పెరిక ముత్యాలు ఇంటి ఆవరణలోని కొబ్బరిచెట్టుపై పిడుగుపడింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. అకాల వర్షానికి అంగడిపేట స్టేజీ, ఘనపురం, గుడిపల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం రాశుల చుట్టూ వరద చేరింది. కొన్నికేంద్రాల్లో ధాన్యాన్ని కాంటా వేసినా లారీల జాప్యంతో ఎగుమతులు నిలిచి వర్షానికి తడిసి ముద్దయ్యాయని రైతులు ఆవేదన చెందుతున్నారు.



పీఏపల్లి మండలం కొట్టాలగడ్డ గ్రామంలో పిడుగుపడి ఎగిసిపడుతున్న మంటలు

నిర్వాహకుల నిర్లక్ష్యం రైతుకు శాపం

పీఏసీఎస్‌లో ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. కాంటా వేసి బస్తాలలో లోడు చేసిన ధాన్యం సకాలంలో లారీలు రాకపోవడంతో అకాల వర్షానికి తడిసి ముద్దయ్యాయి. గుడిపల్లి మండంలో గత నెల 22న కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఇంత వరకు మిల్లలకు ఎగుమతి చేయలేదు. లారీలు, హమాలీల కొరత కారణంగా ధాన్యం కొనుగోళ్లు కూడా మందగించిందని అధికారులు తెలిపారు. అప్పటినుంచి కొనుగోలు కేంద్రంలోని ధాన్యం తేమ చూడలేదని రైతులు ఆరోపించారు. ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటున్నాయని, కేంద్రాలకు తెచ్చిన ధాన్యాన్ని సకాలంలో తూకం వేసి, ఎగుమతులు పూర్తిచేసేలా ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు.




రెడ్లకుంటలో ఎగిరిపడిన పైకప్పు రేకులు, నల్లబండగూడెంలో రాలిన మామిడికాయలు

50 ఎకరాల్లో మామిడి పంట నష్టం

కోదాడరూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కోదాడ మండలం గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులు, వర్షానికి అనేకచోట్ల విద్యుత్ స్తంభాలు కూలిపోగా, పలుచోట్ల ఇంటి పైకప్పుల రేకులు ఎగిరిపోవడంతో పాటు మామిడితోటలకు తీవ్ర నష్టం జరిగింది. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం రాశులు తడిసిముద్దయ్యాయి. దీంతో రైతులు ఇబ్బందులుపడ్డారు. రెడ్లకుంట, కాపుగల్లు, దోరకుంట, నల్లబండ గూడెం,చిమిర్యాల గ్రామాల్లో సుమారు 50 ఎకరాల్లో మామిడికాయలు రాలి తీవ్ర నష్టం జరిగింది. చిమిర్యాల గ్రామానికి చెందిన రావూరి వెంకటేశ్వరరావుకు చెందిన ఐదుఎకరాల్లో మామిడి తోటలో కాయలు రాలి తీవ్రనష్టం జరిగింది. కాయ కొంత పగిలిందని, మార్కెట్‌కు తీసుకెళ్లినా రేటు వచ్చే అవకాశం లేదని రైతు వెంకటేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. తోటను రూ.2 లక్షలకు కౌలుకు తీసుకున్నానని, ఈదురుగాలులతో తీవ్రనష్టం జరిగిందని, ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

కాపుగల్లులో ఈదురుగాలులకు రైతు బాలెబోయిన రాజు చెందిన 10 ఎకరాల మామిడితోటలో కాయలు రాలాయి. రూ.4 లక్షలకు కౌలుకు తీసుకుని సాగు చేశానని, రాలిపోయిన కాయలను విక్రయించినా కూలీల డబ్బులు కూడా వచ్చే అవకాశం లేదని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. రెడ్లకుంటలో పిడమర్తి పెద్దసైదులు, అన్నెపంగు వెంకట్, నూకపంగు దిలీప్, సైదులుకు చెందిన ఇళ్ల పైకప్పు రేకులు ఈదురుగాలులకు ఎగిరిపోయాయి. ఇంట్లో వస్తువులన్నీ పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. రెడ్లకుంట, నల్లబండగూడెం గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపోయి విద్యుత్ సరఫరాకు నిలిచిందని గ్రామస్థులు తెలిపారు. రెడ్లకుంటతో పాటు నల్లబండగూడెం, కూచిపూడి గ్రామాల్లోనూ ఈదురుగాలులకు అనేక ఇళ్ల పైకప్పు రేకులు ఎగిరిపోయాయని గ్రామస్థులు తెలిపారు. నల్లబండగూడెం, రెడ్లకుంట, దోరకుంట గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయిందని రైతులు తెలిపారు. రెడ్లకుంట గ్రామంలో ఇళ్లు కూలిపోయిన వారిని మాజీ సర్పంచ్ సాతినేని లీలా అప్పారావు ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



మనోవేదనతో యువకుడి బలవన్మరణం



శ్రీధర్(ఫైల్‌ఫొటో)

తుర్కపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): మానసిక వేదనతో ఓ యువకుడు బలవన్మరణం చెందాడు. ఈ సంఘటన శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం తిర్మలాపూర్ గ్రామంలో జరిగింది. ఏఎస్ఐ ఎండీ ఖాజా లతీఫ్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన తీగుళ్ల ఉర్మిల ఆగయ్య దంపతుల రెండో కుమారుడు తీగుళ్ల శ్రీధర్(20) పెయింటింగ్ పనిచేస్తూ జీవిస్తున్నాడు. తడు కొంతకాలంగా మానసికంగా బాధపడుతూ ఒంటరిగా ఉంటున్నాడు. ఉదయం శ్రీధర్ తల్లి ఉపాధిహామీ కూలి పనికి వెళ్లింది. తండ్రి వ్యవసాయ పనులపై బయటకు వెళ్లాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న శ్రీధర్ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు, మధ్యాహ్నం పనిముగించుకుని తల్లి ఇంటికి రాగా కుమారుడు ఉరి వేసుకోని మృతి చెందడాన్ని గుర్తించింది. చేతికందిన కుమారుడు ఆత్మహత్య చేసుకోవడంతో తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరుగా రోదించారు. శ్రీధర్ తండ్రి ఆగయ్య ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

ఆటో బోల్తా : వృద్ధుడి మృతి

నార్కట్‌పల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి) : ఆటో బోల్తా పడిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని బీ.వెల్లెంల శివారులో శుక్రవారం రాత్రి జరిగింది. బీ.వెల్లెంల గ్రామస్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బొప్పని మారయ్య(71) మేకలను కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. నార్కట్‌పల్లికి ఇంటి పనిపై వచ్చి తిరిగి ఆటోలో వెళ్తున్నాడు. ప్రమాదవశాత్తు అదుపుతప్పి ఆటో బోల్తా కొట్టింది. ఆ సమయంలో ఆటోలో మొత్తం 8 మంది ఉన్నారు. ఈ ఘటనలో మారయ్య అక్కడికక్కడే మృతి చెందగా, మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. వీరితో పాటు ఆటోడ్రైవర్‌కి, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

కారు ఢీకొని చేపలవ్యాపారి..

కొండమల్లేపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి) : కారు ఢీకొని ద్విచక్ర వాహనదారుడు మృతి చెందాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలో జరిగింది. ఎస్ఐ రాంమూర్తి తెలిపిన వివరాల ప్రకారం పీఏపల్లి మండలంలోని మేడారం గ్రామపంచాయతీకి చెందిన చెనమోని సత్యం(53) తన బైక్‌పై చేపల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలోనే బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యలో చిన్నఅడిశర్లపల్లి గ్రామ సమీపంలోని సంజీవని ట్రస్ట్ వద్దకు రాగానే పెద్దవూర నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న కారు అదుపుతప్పి వేగంగా బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో సత్యంకు బలమైన గాయాలుకావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి భార్య అంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ రాంమూర్తి తెలిపారు.

ఇద్దరు బైక్ దొంగల అరెస్ట్

కేతేపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి) : వాహనాల తనిఖీల్లో నల్లగొండ జిల్లా కేతేపల్లి పోలీసులకు ఇద్దరు దొంగలు పట్టుబడ్డారు. ఎస్ఐ శివతేజ తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్-విజయవాడ 65వ నెంబరు జాతీయ రహదారిపై కొర్లపహాడ్ గ్రామంలోని జంక్షన్ వద్ద ఎస్ఐ శివతేజ తన సిబ్బందితో వాహనాలు తనిఖీ చేస్తూ జరిమానాలు విధిస్తున్నారు. ఇదే సమయంలో పల్సర్ బైక్‌పై హైదరాబాద్ వైపునకు వెళ్తున్న సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సీతారాంపురం ప్రాంతానికి చెందిన కంభం కుమార్, బోలు లక్ష్మీనరసింహలు అనుమానాస్పదంగా వ్యవహరించడంతో వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో ఈ ఏడాది ఫిబ్రవరి 14న కేతేపల్లి మండలం కొప్పోలులో జరిగిన ఓ దొంగతనంలో వీరిపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదై తప్పించుకు తిరుగుతున్న పాత నేరస్థులుగా గుర్తించారు. మరోవైపు వారు నడుపుతున్న పల్సర్ బైక్‌ను అపహరించి హైదరాబాద్‌లో విక్రయించడానికి వెళ్తున్నట్లు విచారణలో తెలియడంతో ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకుని ఇరువురు యువకులను అరెస్టు చేసి నకిరేకల్ మున్సిఫ్ కోర్టులో రిమాండ్ చేసినట్లు ఎస్ఐ శివతేజ వివరించారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

హుజూర్‌నగర్, మే 2 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్ఐ ముత్తయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని మిర్యాలగూడ రోడ్డు గోల్డెన్ సిటీ కాలనీ సమీపంలోని ఆత్కూరి రమేష్ పొలంలో శుక్రవారం పశువుల కాపరి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. ఐదు అడుగుల ఎత్తు బక్క పలుచగా ఉన్న సుమారు 35 ఏళ్ల వయస్సు కలిగిన వ్యక్తి మెడలో నలుపు రంగు దారంతో, తాయత్తు ఉన్నట్లు తెలిపారు. కుడి చేతికి ఎరుపు పసుపుపచ్చ దారాలు ఉండగా బ్లూ రంగు బ్రాండ్ ఉన్నట్లు తెలిపారు. ఆనవాళ్లు తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కనగల్, మే 2 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కనగల్ మండలం బుడుమర్లపల్లి గ్రామ వాగు నుంచి అక్రమంగా ఇసుకను నల్లగొండకు తరలిస్తున్న ట్రాక్టర్‌ను శుక్రవారం పట్టుకున్నట్టు ఎస్ఐ విష్ణుమూర్తి తెలిపారు. ట్రాక్టర్‌ను స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేశామన్నారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

గుర్తింపు మార్చుకుని.. కుటుంబాన్ని వదులుకుని

● ఆరేళ్ల క్రితం తప్పించుకున్న పెరోల్ ఖైదీ అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ కొత్తపల్లి నర్సింహ

సూర్యాపేట క్రైం, మే 2 (ఆంధ్రజ్యోతి) : పెరోల్‌పై జైలు నుంచి బయటకు వచ్చి ఆరేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న వ్యక్తిని సూర్యాపేట జిల్లా పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ కొత్తపల్లి నర్సింహా కేసుకు సంబంధించిన వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. సూర్యాపేట జిల్లాలోని మఠంపల్లి మండల కేంద్రానికి చెందిన బొడ్డు తిరుపతి 2012లో రాచకొండ కమిషనరేట్ పరిధిలోని వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిని హత్యచేశాడు. ఆ కేసుకు సంబంధించి తిరుపతిని అరెస్ట్‌చేశారు. 2015లో రంగారెడ్డి జిల్లా మూడవ అదనపు సెషన్స్ కోర్టు తిరుపతికి జీవిత ఖైదు విధించింది. అనంతరం తిరుపతిని పోలీసులు చర్లపల్లి జైలుకు పంపించారు. జైలులో శిక్ష అనుభవిస్తున్న సమయంలో 2017 ఆగస్టు 17న నెల రోజుల పెరోల్‌పై బయటకు వచ్చాడు. ఆ తర్వాత తిరిగి జైలుకు వెళ్లకుండా ఆరేళ్లుగా తప్పించుకుని తిరుగుతున్నాడు. చర్లపల్లి జైలు అధికారులు మఠంపల్లి పోలీసులకు గతేడాది ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కోదాడ డీఎస్పీ మామిళ్ల శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐటీ విభాగం సహకారంతో నిందితుడు తిరుపతి గుంటూరు జిల్లాలో ఉన్నట్లు నిర్ధారించుకున్నారు. అనంతరం శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బృందం అక్కడికి వెళ్లి తిరుపతిని అరెస్ట్ చేశారు. తిరుపతి తన అసలైన గుర్తింపును పూర్తిగా మార్చుకుని, తన కుటుంబ సభ్యులు, స్వగ్రామం నుంచి పూర్తిగా సంబంధాలు తెంచుకున్నాడు. గుంటూరులోని ఓ హోటల్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గుంటూరుకు చెందిన ఓ మహిళను వివాహం చేసుకుని ఆమెతో కలిసి జీవనం సాగిస్తున్నాడు. తన వద్ద గతం తాలూకు ఎటువంటి ఆధారాలు లేకుండా గతాన్ని పూర్తిగా దాచి ఉంచి పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు ప్రయత్నించాడు. ఎట్టకేలకు కోదాడ డివిజన్ పోలీసులు చేసిన ప్రత్యేక కృషితో తిరుపతి పోలీసులకు పట్టుబడినట్లు ఎస్పీ తెలిపారు. తిరుపతిని పట్టుకునేందుకు కృషి చేసిన సిబ్బందిని ఎస్పీ అభినందించి వారికి రివార్డులు అందజేశారు. సమావేశంలో కోదాడ డీఎస్పీ మామిళ్ల శ్రీధర్‌రెడ్డి, హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, మఠంపల్లి ఎస్ఐ బాబు, ఐటీకోర్ ఆర్ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది ఎం. రామారావు, శంభయ్య ఉన్నారు.

గైర్హాజరైన వైద్యులపై కలెక్టర్‌కు నివేదిక

కలెక్టర్ నిర్ణయంతో తదుపరి చర్యలు

మిర్యాలగూడ అర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో విధులకు గైర్హాజరైన వైద్యులపై చర్యలు తీసుకునేందుకు సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్ సిద్ధమయ్యారు. ఆస్పత్రిలో గురువారం నిర్వహించిన ఆకస్మిక తనిఖీలో పలువురు వైద్యులు విధులకు గైర్హాజరయ్యారు. ఆయా విభాగాల్లో పనిచేస్తున్న డాక్టర్ల వివరాలను సేకరించి తదుపరి చర్యలపై అనుమతులు కోరుతూ తయారుచేసిన నివేదికను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి శుక్రవారం పంపించారు. ఏరియా ఆస్పత్రిలో 43 మంది వైద్యులు పనిచేస్తున్నట్లు హాజరుపట్టిక తనిఖీలో బహిర్గతం కాగా, 8మంది వైద్యులు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా విధులకు గైర్హాజరుకావడంపై ఆస్పత్రి సూపరింటెండెంట్ సమాధానమివ్వలేకపోయారు. దీంతో సదరు వైద్యులు తాము నిర్వహిస్తున్న ప్రైవేట్ క్లినిక్‌లలో పనిచేస్తూ ప్రభుత్వ ఆస్పత్రి విధులకు డుమ్మాకొడుతున్నట్లుగా సబ్ కలెక్టర్ విచారణలో తేలింది. వైద్యుల నిర్లక్ష్యంతో ఆస్పత్రిలో చికిత్స కోసం వస్తున్న పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్ర అసౌకర్యానికి లోనవుతున్నట్లుగా ఫిర్యాదులొచ్చిన నేపథ్యంలో శాఖాపరమైన చర్యలకు ఉపక్రమించారు. దీంతో ఆస్పత్రిలోని జనరల్ ఫిజిషియన్ విభాగంలో పనిచేస్తున్న డాక్టర్ భానుప్రసాద్, ప్రసన్న, అనస్తీషియా వైద్యుడు సంతోష్‌కుమార్, గైనిక్‌డాక్టర్ స్పందన, నేత్రవిభాగం వైద్యుడు రంగారెడ్డి, శ్వాసకోశ వైద్యవిభాగం డాక్టర్ రోహిత్, సైకాలజిస్ట్ డాక్టర్లు వీరజ, విజయ్‌కుమార్‌లపై శాఖాపరమైన చర్యల నిమిత్తం అనుమతులు కోరుతూ సబ్ కలెక్టర్ రూపొందించిన నివేదికను కలెక్టర్‌కు సమర్పించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సదరు వైద్యులపై తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

బాలుడి ప్రాణం తీసిన

ఈత సరదా

సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలో ఘటన



కొమ్ము లోకేష్(ఫైల్ ఫొటో)

మేళ్లచెర్వు, మే 2 (ఆంధ్రజ్యోతి): ఈత సరదా బాలుడి ప్రాణం తీసింది. శుక్రవారం సూర్యాపేట జిల్లా చింతలపాలెం మండలంలో ఈ ఘటన జరిగింది. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపాలెం మండలం నెమలిపురి గ్రామానికి (పులిచింతల కాలనీ) చెందిన కొమ్ము లోకేష్(16) కోదాడ సమీపంలోని గురుకుల పాఠశాలలో ఎనిమిదో తరగతి పూర్తి చేశాడు. తల్లిదండ్రులు కూలి పని చేసుకుని జీవిస్తున్నారు. వేసవి సెలవులు కావటంతో స్వగ్రామం నెమలిపురి చేరుకుని ఐదుగురి స్నేహితులతో కలిసి ఈత నేర్చుకునేందుకు పులిచింతల బ్యాక్‌వాటర్‌లో దిగారు. ఖాళీ ప్లాస్టిక్ డబ్బాను నడుముకు కట్టుకుని నీటిలో ఈదుతుండగా, డబ్బా ఊడిపోవటంతో ఒక్కసారిగా నీటిలో మునిగిపోయాడు. గమనించిన స్నేహితులు గ్రామస్థులకు సమాచారం ఇచ్చారు. మత్స్యకారులు, గ్రామస్థులు నీటిలో గాలించగా కొంత దూరంలో లోకేష్ మృతదేహం లభ్యమైంది. లోకేష్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. లోకేష్‌కు ఓ సోదరి ఉంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ క్రైం ఎస్ఐ అజయ్ తెలిపారు.

వేసవిలో బాటసారులకు బాసటగా..



చందంపేట మండలం పోలేపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద పార్వతిపుత్ర హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు ఏర్పాటుచేసిన చలివేంద్రం

నల్లగొండ జిల్లాకు చెందిన పలువురు మానవ సేవే మాధవ సేవగా భావించి స్వచ్ఛంద సంస్థలు స్థాపించి సమాజ సేవ చేస్తున్నారు. వేసవిలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు, విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్లతో పాటు అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వారికి ఆర్థికసాయం అందజేస్తున్నారు. తాము సంపాదించే దానిలో ఎంతోకొంత 10 మందికి తమవంతుగా సాయం అందించాలన్న తలంపుతో ముందుకు సాగుతున్నారు.



పరీక్షా కేంద్రాల్లో పదవ తరగతి విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న చైత్ర ఫౌండేషన్ చైర్మన్ రామకృష్ణాగౌడ్, సభ్యులు

(ఆంధ్రజ్యోతి-చందంపేట)

సమాజంలోని చుట్టుపక్కల వారి కోసం ఎంతోకొంత అత్యవసర సమయంలో మేమున్నామంటూ నల్లగొండ జిల్లా చందంపేట మండలంలోని పార్వతిపుత్ర హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ సహాయం అందిస్తోంది. వేసవిలో పోలేపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద చలివేంద్రం ఏర్పాటుచేసి ప్రయాణికులకు దాహార్తిని తీరుస్తున్నారు. సేవలు మరింత ముందుకు దాతలసహాయంతో తీసుకెళ్తామని స్వచ్ఛంద సంస్థ సభ్యులు తెలిపారు. ప్రార్థించే పెదవులకన్నా, సహాయం చేసే చేతులుమిన్నా అని భావించే ఈ సంస్థ సభ్యులు ఆపదలో ఉన్నవారికి ఏదో ఒకవిధంగా సహాయం అందిస్తున్నారు. 2024లో నలుగురుతో ప్రారంభమైన సంస్థ నేడు 121మంది సభ్యులకు చేరింది. సంస్థలో సభ్యత్వం పొందిన ప్రతి ఒక్కరూ ప్రతి నెలా రూ.100 చొప్పున పొదుపు చేస్తూ ఎవరికైనా అనారోగ్యంతో ఉన్నా, ఆసుపత్రుల్లో ఉన్నా ఆర్థికసహాయం అందజేస్తున్నారు. రెండేళ్ల నుంచి చందంపేట మండలం గన్నేర్లపల్లి గ్రామానికి చెందిన క్యాన్సర్ పేషంట్‌కు ఆర్థిక సహాయం, మురుపునూతల గ్రామంలో బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారికి ఆపరేషన్ నిమిత్తం ఆర్థిక సహాయం అందించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడి కుటుంబ సభ్యులకు నిత్యావసరాలు అందజేశారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రుల్లో గర్భిణులకు బేబీకిట్లు, ప్రభుత్వ పాఠశాల్లోని విద్యార్థులకు నోట్ పుస్తకాలు, 10వ తరగతి పరీక్షలు రాసే విద్యార్థులకు పరీక్ష సామగ్రిని తమవంతుగా అందజేస్తున్నారు.

సంస్థ సేవలను విస్తరిస్తాం




భవిష్యత్‌లో సంస్థ తరుపున ఉత్తమ విద్యార్థులకు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు, రోగులకు దాతల సహాయంతో మరింత మెరుగైన సహాయం అందజేస్తాం.

పార్వతిపుత్ర హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపక సభ్యులు హరీష్

(ఆంధ్రజ్యోతి-శాలిగౌరారం)

సంపాదించే దానిలో కొంతైనా సామాజిక సేవకు వెచ్చించాలనే తలంపుతో నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలం ఇటుకులపహాడ్ గ్రామానికి చెందిన చైత్ర ఫౌండేషన్ చైర్మన్ యంగలి రామకృష్ణగౌడ్ ముందుకుసాగుతున్నారు. పేదింట్లో పుట్టినా కష్టపడి చదివి నేడు ఆర్థికంగా ఎదిగారు. తాను చదవడానికి, ఎదగడానికి ఎన్నో ఇబ్బందులు బాధలుపడ్డారు. దీంతో తాను సంపాదించిన దాంట్లో కొంతైనా సాయం చేయాలనే సంకల్పం ఆయనకు కలిగింది. తన కుమార్తె చైత్ర పేరు మీద ఫౌండేషన్ ఏర్పాటుచేసి స్వగ్రామంలో రూ.2 లక్షలతో ప్యూరీఫైడ్ వాటర్‌ఫిల్టర్ ఏర్పాటుచేయించారు. మండలంలో ప్రతీ ఏడాది పదవ తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్షాకేంద్రాల వద్ద చల్లటి మజ్జిగ ప్యాకెట్లను అందిస్తున్నారు. శాలిగౌరారం మండలకేంద్రంలో వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటుచేస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రుల్లో మజ్జిగప్యాకెట్లను అందజేస్తున్నారు.

సమాజ సేవ నా ధ్యేయం



నా సంపాదన నుంచి 10 మందికి సేవ చేయాలనే సంకల్పం నాది. ప్రజాసేవకు మించిన తృప్తి ఏదీ ఉండదు. నేను పేదరికం పుట్టి ఎన్నో బాధలు అనుభవించా. అలా ఎవరూ బాధపడవద్దని సహాయం అందించాలనుకున్నా. వేసవిలో విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్లు, ప్రజలకోసం చలివేంద్రాలను ఏర్పాటుచేసి దాహార్తిని తీరుస్తుండటం సంతోషంగా ఉంది. స్వచ్ఛంద సంస్థల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

యంగలి రామకృష్ణ గౌడ్, చైత్ర ఫౌండేషన్ చైర్మన్

కృష్ణా జలాల మళ్లింపునకు ప్రణాళికలు

● మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి



ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి

చౌటుప్పల్ టౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం మండలాలకు కృష్ణా జలాలను మళ్లించేందుకు అవసరమైన ప్రణాళికలను సిద్ధంచేయాలని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మునుగోడు క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం రిటైర్డ్ ఇంజనీర్స్ ఫోరం సభ్యులు, నీటి పారుదల శాఖ అధికారులతో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. శివన్నగూడెం రిజర్వాయర్ నుంచి కృష్ణా జలాలను చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం మండలాలకు మళ్లింపుపై చర్చించారు. డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా మునుగోడు నియోజకవర్గంలోని లక్ష్మాపురం, శివన్నగూడెం రిజర్వాయర్లకు కొనసాగింపుగా చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం మండలాలకు కృష్ణా జలాలను అందించడానికి అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని ఎమ్మెల్యే సూచించారు. హైదరాబాద్ మహానగరానికి సమీపంలో ఉన్న చౌటుప్పల్ పట్టణం శరవేగంగా అభివృద్ధి చెందుతుందని, భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని పెరుగుతున్న జనాభాకు సరిపడా తాగునీరు అందించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అదేవిధంగా చౌటుప్పల్, సంస్థాన్‌నారాయణపురం మండలాలకు సాగునీరు అందించాల్సి ఉందని, ఈ మండలాల్లోని చెరువులు, కుంటలను నింపి భూగర్భజలాలను పెంపొందించాలన్నారు. ఈ మండలాలకు సాగు, తాగు నీరు అందించేందుకు అన్ని రకాల మార్గాలను అన్వేషించాలని, రైతులకు సాగు నీరు, ప్రజలకు తాగు నీరు అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ప్రతీ ఎకరానికి సాగు నీరు అందించి రైతుల్లో ఆనందాన్ని చూడాలని, రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. సమావేశంలో తెలంగాణ ఇంజనీర్స్ ఫోరం సభ్యులు శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, చంద్రమౌళి, సత్తిరెడ్డి, గట్టుప్పల్ డీఈ సురేందర్ రెడ్డి, ఏఈ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

వేసవి క్రీడా శిక్షణా శిబిరాలు ప్రారంభం



తిప్పర్తి మండలం మామిడాలలో శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

నల్లగొండ స్పోర్ట్స్, మే 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన వేసవి శిక్షణా శిబిరాన్ని శుక్రవారం ప్రారంభించారు. జిల్లాలోని ఎంపిక చేసిన 12 ప్రాంతాల్లో ఆరు క్రీడాంశాల్లో శిక్షణా శిబిరాలను మొదలు పెట్టారు. నల్లగొండ అర్బన్ ప్రాంతం ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్, అవుట్ డోర్ స్టేడియంలో బాక్సింగ్, కుర్మేడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో, హాలియాలో కబడ్డీ, జిల్లా పరిషత్ మామిడాల, చెర్వుఅన్నారంలో హ్యాండ్ బాల్, కొప్పోల్‌లో వాలీబాల్, నెమ్మానిలో ఖోఖో, ఉరుమడ్లలో హాకీ, ఎల్లారెడ్డిగూడెంలో జూడో, గట్టుప్పల్ బాల్ బ్యాడ్మింటన్, వెల్మకన్నెలో వాలీబాల్ క్రీడాంశాల్లో నెలరోజులపాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఎంపికచేసిన పీడీలు, పీఈటీలు ఉదయం, సాయంత్రం వేళలో తర్ఫీదు ఇవ్వనున్నారు. దీంతో శిక్షణ శిబిరాలన్నీ క్రీడాకారులతో సందడిగా మారాయి. తిప్పర్తి మండలం మామిడాల జడ్పీహెచ్ఎస్ హైస్కూల్‌లో హ్యాండ్‌బాల్ శిక్షణ శిబిరాన్ని మాజీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డి, నల్లగొండ మార్కెట్ కమిటీ ఛైర్మన్ జూకూరి రమేష్ హాజరై క్రీడాపోటీలను ప్రారంభించారు.

మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ

కేంద్ర భూగర్భ జలవనరుల శాఖ శాస్త్రవేత్త మాధవ్

ఆలేరు రూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): మొక్కల పెంపకంతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమని కేంద్ర భూగర్భ జలవనరుల శాఖ శాస్త్రవేత్త సి మాధవ్ అన్నారు. శుక్రవారం రామవపురం గ్రామాన్ని ఆయన సందర్శించి పలు విషయాలను ప్రజలకు వెల్లడించారు. రోజురోజుకూ పర్యావరణం కలుషితమై ఎండలు మండి పోతున్నాయన్నారు. ప్రతీఒక్కరు కనీసం 10మొక్కలను పెంచాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో అరుణకుమారి, తిరుమలచారి, రామచంద్రయ్య, రాజు పాల్గొన్నారు.

10 అడుగులకు శాలిగౌరారం ప్రాజెక్టు నీటిమట్టం

శాలిగౌరారం, మే 2 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లాలో మధ్యతరహా ప్రాజెక్టుల్లో ఒకటైన శాలిగౌరారం ప్రాజెక్టులో శుక్రవారం సాయంత్రం వరకు 10 అడుగుల నీటి మట్టం నమోదైంది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు మూసీ నది ప్రవహిస్తుండటంతో పల్లివాడ మూసీ ఆనకట్ట నుంచి శాలిగౌరారం ప్రాజెక్టులోకి నీరు భారీగా వచ్చి చేరుతోంది. శాలిగౌరారం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 21 అడుగులుగా ఉంటుంది. మూసీ నది ఇలానే ప్రవహిస్తే ఈ నెల చివరి వారంలో ప్రాజెక్టు పూర్తిగా నిండి అలుగు పోస్తుందని అధికారులు పేర్కొంటున్నారు.

బత్తాయి ధర పతనం

(5వపేజీ తరువాయి)

ప్రాంతం మెట్ట పంటలకు ప్రసిద్ధి. నీటి వినియోగం తక్కువగా ఉండే బత్తాయిని అనంతపురం, కడప ప్రాంతాల్లో లక్షల ఎకరాల్లో సాగు చేశారు. వేసవిలో వచ్చే కత్తెర పంటకు అక్కడి వాతావరణం అనుకూలంగా ఉండటంతో ఎక్కువగా ఉత్పత్తి చేస్తారు. ప్రస్తుతం అనంతపురం మార్కెట్‌కు రోజుకు వెయ్యి టన్నుల వరకు కత్తెర బత్తాయి వస్తోందని వ్యాపారులు చెబుతున్నారు. కాయ చాలా వరకు నాణ్యతగా ఉండటంతో పాటు టన్నుకు రూ.22వేల వరకు ధరకు రైతులు విక్రయిస్తున్నారు. టన్నుకు రెండు క్వింటాల చొప్పున తరుగు తీస్తుండటంతో కోత కూలీలు సగం రైతులే భరిస్తుండటంతో వారికి రూ.18వేల వరకు గిట్టుబాటు అవుతోంది. ఈ ప్రాంతం నుంచే భారీగా బత్తాయి కాయలు ఉత్తర భారత దేశానికి ఎగుమతి అవుతోంది. దీంతో మన బత్తాయికి ధర పడిపోయిందని రైతులు చెబుతున్నారు.

కత్తెర కాయ దిగుబడి లేదు



పదెకరాల్లో బత్తాయి సాగు చేస్తున్న. ప్రతికూల వాతావరణ మార్పులతో ఒక్క టన్ను దిగుబడి కూడా రాలేదు. చాలా తోటల్లో ఇదే పరిస్థితి నెలకొంది. బత్తాయి దిగుబడులు పూర్తి స్థాయిలో పడిపోయాయి. అయినా మార్కెట్లో ధర లేకుండా పోయింది. వేరే ప్రాంతాల్లో సాగు విస్తీర్ణం, దిగుబడులు పెరగడం, వినియోగం తగ్గడంతో ధరలు పడిపోయాయని వ్యాపారులు చెబుతున్నారు. సాగులో చాలా కష్టాలు పడుతున్నాం. ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహం అందడం లేదు.

నక్కల లింగారెడ్డి, రైతు పెద్దగూడెం, అనుముల మండలం

మంగు నల్లితో సాగు కష్టం



బత్తాయిలో మంగునల్లి, త్రిప్స్ వ్యాప్తి అధికంగా ఉండటంతో సాగు వ్యయం భారీగా పెరిగింది, వాతావరణ మార్పులతో చెట్లు దెబ్బతింటున్నాయి. ఎన్ని మందులు పిచికారీ చేసినా పెద్దగా ఫలితం ఉండటం లేదు. పెట్టుబడి పెరుగుతుండగా, దిగుబడులు బాగా పడిపోయాయి. కాయకు ధర ఉండటం లేదు. సాగులో చాలా ఇబ్బందులు పడుతున్నాం. అయినా పట్టించుకునే వారే కరవయ్యారు. ప్రభుత్వం బత్తాయి రైతులను ఆదుకోవాలి.

మాధవరెడ్డి, రైతు మొల్కపట్నం, వేములపల్లి మండలం



రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమితులై బాధ్యతలు స్వీకరించిన కే.రామకృష్ణారావును భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

ప్రవేశాలపై పరేషాన్!





● ఇంటర్, డిగ్రీ ప్రవేశాలకు నోటిఫికేషన్లు
● నేటికీ పూర్తికాని గత విద్యా సంవత్సర డిగ్రీ పరీక్షలు
● దరఖాస్తుల స్థాయిలోనే ప్రైవేట్ ఇంటర్ కళాశాలల అనుమతుల రెన్యువల్ ప్రక్రియ

(ఆంధ్రజ్యోతి-భువనగిరి టౌన్)

డిగ్రీ, ఇంటర్ ప్రవేశాలకు నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. 2025-26 విద్యా సంవత్సరంలో డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు మూడు దశల నోటిఫికేషన్ శుక్రవారం, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఈ నెల 1వ తేదీన నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. అయితే గత సంవత్సరం డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు నేటికీ జరగకపోవడం, ప్రస్తుత విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రైవేట్ కళాశాలల ప్రభుత్వ గుర్తింపు రెన్యువల్‌కు దరఖాస్తు గడువు ముగియకపోవడం, నేటికీ సీట్ల కేటాయింపునకు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలకు ఇంటర్ బోర్డు లాగిన్ ఇవ్వలేదు. ఈనేపథ్యంలో ప్రవేశాల నోటిఫికేషన్లు జారీకావడంతో విద్యార్థులు, యాజమాన్యాల్లో గందరగోళం నెలకొన్నట్లు తెలుస్తోంది. అయితే అధికారులు మాత్రం ఎప్పటిలాగే అడ్మిషన్ల ప్రక్రియ ఆన్‌లైన్‌లో ఉంటుందని, మిగతా ఇబ్బందులు త్వరలోనే పరిష్కారమవుతాయని భరోసా ఇస్తున్నారు.

జూన్ 2 నుంచి తరగతులు

ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాల దరఖాస్తుల ప్రక్రియ ఈ నెల 1న ప్రారంభం కాగా 31న ముగియనుంది. జూన్ 2 నుంచి తరగతులు ప్రారంభమవుతాయి. మొదటి దశ పూర్తయ్యాక రెండో దశ షెడ్యూల్ లేదా గడువు పొడిగింపునకు అవకాశాలున్నాయి. ప్రభుత్వ యాజమాన్య సంక్షేమ గురుకుల, ఆశ్రమ కళాశాలల్లో కూడా నేరుగా ప్రవేశాలకు అవకాశం కల్పించారు. అయితే 50శాతం సీట్లను ఏదేని సంక్షేమ గురుకుల, ఆశ్రమ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు రిజర్వేషన్, మిగతా 50శాతం సీట్లను జనరల్ విద్యార్థులకు రిజర్వేషన్ రోస్టర్ ఆధారంగా కేటాయిస్తారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు 400 ప్రభుత్వ, ప్రభుత్వ యాజమాన్య గురుకుల, ఆశ్రమ, ఎయిడెడ్, ప్రైవేట్ కళాశాలలున్నాయి. కాగా ఉమ్మడి జిల్లాలో 39,145 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా, రికార్డు స్థాయిలో 37,994 మంది ఉత్తీర్ణులు కాగా కేవలం 1151 మంది విద్యార్థులు మాత్రమే ఫెయిల్ అయ్యారు. వీరికి త్వరలో అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు జరగనున్నాయి. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ఉమ్మడి జిల్లాలో ఉత్తీర్ణత శాతం గణనీయంగా ఉండగా, అంతే స్థాయిలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు కూడా ఉంటాయని అధికారులు భావిస్తున్నారు. కానీ పలువురు విద్యార్థులు హైదరాబాద్, తదితర ప్రాంతాల్లోని కార్పొరేట్ కళాశాలలకు వెళుతుండటం మరికొందరు పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సుల్లో చేరేందుకు సుముఖత చూపుతుండటంతో ఇంటర్ ప్రవేశాల గడువు ముగిశాకే ఇంటర్‌లో చేరిన విద్యార్థుల సంఖ్యపై స్పష్టత రానుంది. అయితే నిబంధనల ప్రకారం ప్రతీ సంవత్సరం ప్రైవేట్ కళాశాలల ప్రభుత్వ అనుమతులను రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. ఈ మేరకు రెన్యువల్ దరఖాస్తుల గడువు ఈ నెల 5వ తేదీతో ముగియనుంది. దరఖాస్తుల ప్రక్రియ ముగిశాక అధికారులు క్షేత్ర పరిశీలన జరిపి అనుమతులను రెన్యువల్ చేశాకే ఆ కళాశాలలకు ఆన్‌లైన్‌లో సీట్ల కేటాయింపునకు లాగిన్స్ కేటాయింపు జరుగుతుంది. ప్రభుత్వ కళాశాలలకు మాత్రం ఒకటి రెండు రోజుల్లో లాగిన్, పాస్‌వర్డ్ రానున్నాయి. దీంతో అనుమతుల రెన్యువల్, లాగిన్ పాస్‌వర్డ్ కేటాయింపు త్వరగా పూర్తి చేయాలని ప్రైవేట్ యాజమాన్యాలు కోరుతున్నాయి.

నేటి నుంచి డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రస్తుత విద్యా సంవత్సరానికి డిగ్రీ మొదటి సంవత్సరంలో మూడు దశలలో ప్రవేశాలకు దోస్త్ నోటికేషన్ విడుదలైంది. ఉమ్మడి జిల్లాలో సుమారు 75 ప్రభుత్వ ప్రభుత్వ యాజమాన్య గురుకుల, ఎయిడెడ్, ప్రైవేట్ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఇటీవలి ఉమ్మడి జిల్లాలో జనరల్ ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షా ఫలితాలలో 22,431 మంది విద్యార్థులకు 15,432 మంది ఉత్తీర్ణులయ్యారు. వీరిలో పలువురు ఎంసెట్, నీట్, జేఈఈ తదితర కోర్సుల్లో చేరనుండటం, కొందరు లాంగ్ టర్మ్ కోచింగ్‌కు వెళ్లనుండటం, మరికొందరు ఉపాధి వైపు మళ్లనుండటంతో డిగ్రీ ప్రవేశాలపై యాజమాన్యాల్లో ఆందోళన నెలకొన్నది. కానీ 6,999 మంది విద్యార్థులు రాయనున్న అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షల ఫలితాలు డిగ్రీ ప్రవేశాలపై ప్రభావం చూపనున్నాయి. అయితే ప్రభుత్వం మూడు సంవత్సరాల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయకపోవడంతో అప్పుల ఊబిలో కూరుకుపోయినా ప్రైవేట్ యాజమాన్యాలు ప్రాక్టికల్స్, సెమిస్టర్ పరీక్షలను బహిష్కరించడంతో నేటికీ పరీక్షలు జరగలేదు. ఈ నేపథ్యంలో విడుదలైన దోస్త్ నోటిఫికేషన్‌పై పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపుపై ప్రైవేట్ యాజమాన్యాలతో ప్రభుత్వ ప్రతినిధులు జరుపుతున్న చర్చలు కొలిక్కి వచ్చి త్వరలోనే సెమిస్టర్ పరీక్షలు జరుగుతాయని, డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ యథావిధిగా కొనసాగుతుందని ఉన్నత విద్యాశాఖ అధికారులు అంటున్నారు.

మూడు దశల్లో ప్రవేశాలు

	దరఖాస్తులు	సీట్లకేటాయింపులు
మొదటి దశ	మే 3 నుంచి 21	మే 29న
రెండోదశ	మే30 నుంచి జూన్ 8	జూన్13న
మూడో దశ	జూన్ 13 నుంచి 19	జూన్ 23న

డిగ్రీ ప్రవేశాలకు ఆటంకం కల్పించం



ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదలకోసం సెమిస్టర్ పరీక్షలను బహిష్కరించాం. బకాయిల విడుదలకు ప్రభుత్వ ప్రతినిధులతో చర్చలు జరుగుతున్నాయి. అయితే పెండింగ్ బకాయిలు, సెమిస్టర్ పరీక్షల బహిష్కరణతో నిమిత్తం లేకుండా దోస్త్ విధానంలో డిగ్రీ ప్రవేశాల ప్రక్రియకు ఆటంకం కల్పించం. అడ్మిషన్లు స్వీకరిస్తాం.

బి.సూర్యనారాయణరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్.

రెన్యువల్స్, లాగిన్స్ ప్రక్రియ వేగవంతం చేయాలి



ప్రైవేట్ ఇంటర్ కళాశాలల ప్రభుత్వ గుర్తింపు పునరుద్ధరణ ప్రక్రియను వేగవంతం చేసి లాగిన్ పాస్‌వర్డ్ ఇవ్వాలి. ఈ నెల 5వ తేదీతో ముగిసే రెన్యువల్ దరఖాస్తు గడువు పూర్తయిన మరుసటి రోజు నుంచే అధికారులు క్షేత్ర పరిశీలన జరిపి అనుమతులను పునరుద్ధరించాలి. లేదంటే ప్రైవేట్ కళాశాలల్లో అడ్మిషన్ల ప్రక్రియలో ఆలస్యమై, యాజమాన్యాలు నష్టపోయే అవకాశాలుంటాయి.

ఎస్.మల్లేశం, రాష్ట్ర అధికార ప్రతినిధి, తెలంగాణ ప్రైవేట్ ఇంటర్ కళాశాలల యాజమాన్యాల అసోసియేషన్

ఇంటర్ కోర్సులతో ఉజ్వల భవిష్యత్



ఇంటర్ కోర్సులతో విద్యార్థులకు భవిష్యత్ ఉంటుంది. పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులందరూ నచ్చిన ఇంటర్ కోర్సులలో చేరాలి. ప్రభుత్వ కళాశాలల్లో నాణ్యమైన విద్యాబోధన లభిస్తుంది. ఇటీవల లెక్చరర్స్ ఖాళీల భర్తీ జరిగింది. ల్యాబ్‌లు, తదితర సదుపాయాలు ఉంటాయి. ఒత్తిడి తెచ్చే ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకుంటాం.

సి.రమణి, ఇంటర్ నోడల్ అధికారి, యాదాద్రి భువనగిరి.

గుట్ట ఆలయ అభివృద్ధికి కృషి

● సదుపాయాలపై ప్రత్యేక దృష్టి ● 9 నుంచి స్వామి వారి జయంత్యుత్సవాలు ● యాదగిరిగుట్ట ఆలయ ఈవో వెంకట్రావు



సమావేశంలో మాట్లాడుతున్న దేవస్థాన ఈవో వెంకట్రావు

యాదగిరిగుట్ట, మే 2 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఈవో ఎస్.వెంకట్రావు అన్నారు. శుక్రవారం యాదగిరికొండపై ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ ప్రాంతాల నుంచి యాదగిరిగుట్ట క్షేత్రానికి వస్తున్న భక్తుల కోసం సదుపాయాలు కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ఈ నెల 9 నుంచి 11 వరకు ఆలయంలో స్వామి వారి జయంత్యుత్సవాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. మూడు రోజుల పాటు అలంకార, తిరు వీధి సేవలు వైభవంగా చేపట్టేందుకు సన్నాహాలు ప్రారంభించినట్లు చెప్పారు. స్వామివారి జయంత్యుత్సవాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని, భక్తులు అధిక సంఖ్యలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. వేసవి దృష్ట్యా కొండపైన, కొండ కింద ఆధ్యాత్మిక వాడల్లో భక్తుల రద్దీకి అనుగుణంగా తాగు నీటి సౌకర్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు, ఎండ నుంచి రక్షణ పొందేందుకు అవసరం మేరకు చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తామన్నారు.

అవినీతి, అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు

ఆలయ సిబ్బంది అవినీతి, అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని ఈవో వెంకట్రావు అన్నారు. శుక్రవారం ఆయన దేవస్థాన విభాగాలకు చెందిన అధికారులతో రెండు గంటలపాటు సమీక్ష నిర్వహించారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయాన్ని ముందుగా తెరిచేందుకు సూచనలు, సలహాలు తీసుకుని విభాగాల వారీగా సమీక్షించారు. యాదగిరిగుట్ట ఈవోగా రాష్ట్ర ప్రభుత్వం తొలిసారి ఐఏఎస్ పరిపాలన ప్రవేశపెట్టినందున అధికారులు అప్రమత్తంగా ఉండి విధులు పారదర్శకంగా నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా విధులు నిర్వహించినా అవినీతి, అక్రమాలకు పాల్పడినా ఉపేక్షించబోమన్నారు. వివిధ విభాగాలకు సంబంధించిన పలు సమస్యలపై డీఈవో దోర్బల భాస్కరశర్మ ఈవో దృష్టికి తీసుకువచ్చారు. సమావేశంలో ఏఈవోలు గజ్వేల్లి రమేష్‌బాబు, జూశెట్టి కృష్ణ, ప్రతాప నవీన్‌కుమార్ శర్మ, గజ్వేల్లి రఘు, సివిల్ ఈఈ జిల్లెల దయాకర్‌రెడ్డి, ఏఈ శ్రీనివాస్‌రెడ్డి, ఎలక్ట్రికల్ ఈఈ ఊడెపు వెంకటరామరావు, పర్యవేక్షకులు యాస రాకేష్‌రెడ్డి, మాచర్ల రాజన్‌బాబు, దోసాజు నరేష్, నాగుల మహేష్, శంకర్‌నాయక్, వెంకటేశ్, నరేష్ పాల్గొన్నారు.

యాదగిరీశుడి క్షేత్రంలో వైభవంగా

సువర్ణ పుష్పార్చన, ఊంజల్‌సేవ



ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, మే 2 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణ పుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ప్రాకార మండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్య మనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకులు ప్రాకార మండపంలోని అద్దాల మండపం ఊయలలో అధిష్ఠింపజేశారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసులచే మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నిరాజనాల మధ్య ఊంజల్ సేవోత్సవం నేత్ర పర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో కొనసాగాయి. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ. 24,31,680 ఆదాయం సమకూరింది.

భక్తిశ్రద్ధలతో మట్టపల్లివాసుడి కల్యాణం

మఠంపల్లి: మండలంలోని ప్రసిద్ధ మట్టపల్లి పుణ్యక్షేత్రంలో శుక్రవారం శ్రీలక్ష్మీనృసింహుడి నిత్యకల్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం స్వామివారికి మాంగాల్యధారణ, తలంబ్రాలుతో నిత్య కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. మట్టపల్లి క్షేత్రంలో శుక్రవారం కృష్ణమ్మకు మహిళలు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పసుపు, కుంకుమార్చనలు, అభిషేకాలు, చీర, సారె సమర్పించి, దీపాధనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో సిరికొండ నవీన్, అర్చకులు పాల్గొన్నారు.



చెక్‌పోస్టును పరిశీలిస్తున్న సీఐ శ్రీను నాయక్, తహసీల్దార్ శ్రీనివాస్

ఆరు ధాన్యం లారీల పట్టివేత

● వాడపల్లి చెక్‌పోస్ట్ వద్ద పట్టుకున్న పోలీసులు

దామరచర్ల/నాగార్జునసాగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి వస్తున్న ఆరు ధాన్యం లోడు లారీలను రాష్ట్ర సరిహద్దు నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వాడపల్లి వద్ద పోలీసులు అడ్డుకున్నారు. వాడపల్లి ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇతర రాష్ట్రాల్లో పండించిన ధాన్యాన్ని కొందరు దళారులు తెలంగాణలో విక్రయిస్తుండటంతో పోలీస్, వ్యవసాయ, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో రాష్ట్ర సరిహద్దులో చెక్‌పోస్టు నిర్వహిస్తున్నారు. శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు, ప్రకాశం, పల్నాడు తదితర జిల్లాల నుంచి 30 టన్నుల ధాన్యం లోడ్‌తో వస్తున్న ఆరు లారీలను చెక్‌పోస్టు వద్ద అధికారులు నిలిపారు. తనిఖీ చేయగా ఎలాంటి పత్రాలు లేకుండా అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. లారీ యజమానులపై కేసు నమోదుచేసి, ఆరులారీలను స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రానివ్వొద్దు: సీఐ శ్రీనునాయక్

ఏపీ సహా ఇతర రాష్ట్రాల నుంచి ఒక్క ధాన్యం వాహనాన్ని కూడా తెలంగాణలోకి రానివ్వవద్దని సాగర్ సీఐ శ్రీనునాయక్, పెద్దవూర తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఏపీ-తెలంగాణ రాష్ట్ర సరిహద్దులోని నాగార్జునసాగర్ పైలాన్ కొత్త వంతెన వద్ద ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్‌పోస్టును వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇతర రాష్ట్రాలకంటే తెలంగాణలో ధాన్యం మద్దతు ధర ఎక్కువగా ఉండటంతో కొందరు దళారులు ఇక్కడకు తీసుకువచ్చి విక్రయిస్తున్నారన్నారు. అటువంటివారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వరి కోతలు పూర్తయి ధాన్యం విక్రయాలు పూర్తయ్యే వరకు ఈ చెక్‌పోస్టు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సాగర్ ఎస్ఐ సంపత్, ఆర్ఐ దండా శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



నల్లగొండ జిల్లా దామరచర్లలో పోలీసులు నిలిపిన ధాన్యం లోడు లారీలు

భువనగిరిలో సినిమా షూటింగ్ సందడి

● హీరోపై దాడి చేసే సన్నివేశాల చిత్రీకరణ





దర్శకుడు విజయేందర్



భువనగిరి పట్టణంలో కొనసాగుతున్న షూటింగ్

భువనగిరి టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రం భువనగిరి పట్టణంలోని పలు బస్తీల్లో శుక్రవారం సినిమా షూటింగ్ సందడి నెలకొంది. 'బలగం' ఫేమ్ ప్రియదర్శి ఈ సినిమాలో హీరోగా నటిస్తుండగా, వాహనంలో వెళ్తున్న హీరోను విలన్లు వెంటాడి దాడి చేసిన సన్నివేశాలను చిత్రీకరించారు. మరి కొన్ని సన్నివేశాలను పలు ప్రదేశాల్లో చిత్రీకరించారు. షూటింగ్‌ను చూసేందుకు స్థానికులు పెద్ద సంఖ్యలో గుమిగూడారు. ఈ నెల 3న (శనివారం) కూడా పలు సన్నిశాలను చిత్రీకరించనున్నారు. నల్లగొండ జిల్లా కేంద్రం శివాజీనగర్‌కు చెందిన విజయేందర్ సొట్ట దర్శకత్వం వహిస్తున్న తొలి సినిమా కాగా, ఇంకా పేరు ఖరారు చేయలేదని ఆయన తెలిపారు. హీరోయిన్‌గా నూతన నటి నిహారిక, ప్రముఖ తమిళ నటుడు వీటి గణేష్, యూట్యూబర్ ఆశిష్ బెహరా తదితరులు నటిస్తున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

శాలిగౌరారం, మే 2 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు ఎంతో వరమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కందాల సమరంరెడ్డి అన్నారు. మండలంలోని ఆకారం గ్రామానికి చెందిన శీతల అంజయ్యకు మంజూరైన రూ.60వేల సీఎం ఆర్ఎఫ్ చెక్కును ఆయన అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వలిశెట్టి సైదులు, నాయకులు గోదాసు మల్లయ్య, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జవాజి నాగరాజు, నాయకులు జవాజి భూషణం, ముత్తయ్య, రవి, శ్రవణ్, ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

పశువులను రోడ్లపై వదలొద్దు

కేతేపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థులు తమ పశువులను రాత్రివేళల్లో వదలవద్దని ఎస్ఐ ఎ.శివతేజ సూచించారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పశువులను రాత్రివేళల్లో వదలడం వల్ల రహదారులపై సంచరిస్తూ రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. పాడిగేదెలు రోడ్లపై తిరుగుతూ ద్విచక్రవాహనదారులు, ఇతర వాహన డ్రైవర్లకు కనిపించక హైవేతో పాటు గ్రామీణ రోడ్లపైనా ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

లో వోల్టేజీ తిప్పలు తప్పేనా?



- చండూరు మండలంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- కాలిపోతున్న ఎలక్ట్రిక్ వస్తువులు

చండూరురూరల్, మే 2(ఆంధ్రజ్యోతి): అసలే వేసవి కాలం, ముదిరిన ఎండలు, పెరిగిన ఉష్ణోగ్రత, దీనికి తోడు కరెంటు కోతలు అన్నింటికి మించి లోవోల్టేజీ కరెంట్‌తో చండూరు మండలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని రోజులుగా మండలంలో లో వోల్టేజీ సమస్యతో ప్రజలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వేసవికాలం కావడంతో పిల్లలకు పాఠశాలలు సెలవులు రావడం, బయట ఎండలు, ఇంట్లో ఉక్కపోతతో నానాతంటాలు పడుతున్నారు. గ్రామాలలో ఎక్కువగా సింగిల్ ఫేస్ కరెంట్, సరైన ట్రాన్స్‌ఫార్మర్లు లేక 10 కేవీ, 15 కేవీ 25 కేవీ లైన్లు ఉండటంతో సింగిల్ ఫేస్ లైన్లతో నడిపిస్తున్నారు. దీంతో గ్రామాలలో ఒక్కో 10 కేవీ బుడ్డి మీద 50 నుంచి 80 సర్వీసులు ఇవ్వడంతో లో వోల్టేజీ సమస్య ఏర్పడుతోంది. ముఖ్యంగా మండల కేంద్రం మునిసిపాలిటీలో ఈ లో వోల్టేజీ సమస్య తీవ్రస్థాయిలో ఉంది. కొన్ని ప్రాంతాల్లో 63 కేవీ, 100 కేవీ లైన్లు ఉన్నా వాటి మీద అధిక సర్వీసులు ఇవ్వడంతో ఈ లోవోల్టేజీ సమస్య అధికమవుతుంది. మునిసిపల్ పరిధిలోని కొన్ని కొన్ని ప్రాంతాల్లో 100 కేవీ లైన్ మీద 500 సర్వీసుల వరకు కనెక్షన్లు ఇవ్వడంతో ఈ సమస్య పెరిగింది. మరీ ముఖ్యంగా బిజీగా ఉండే వ్యాపార సముదాయం ఏరియాలో 150 కేవీ లైన్ మీద 600 నుంచి 700 సర్వీసుల కనెక్షన్లు ఇవ్వడంతో సమస్య తీవ్రతరంగా మారింది. ఒక 100 కేవీ లైన్ మీద 120 నుంచి 200 వరకు సర్వీసులు ఉంటే నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుంది. కానీ అధికంగా విచ్చలవిడిగా కనెక్షన్లు ఇవ్వడంతో ఈ లోవోల్టేజీ సమస్య మరింత పెరిగింది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఉచిత విద్యుత్ కూడా ఓ కారణమే...

ఈ లోవోల్టేజీ సమస్యకు ఉచిత విద్యుత్ కూడా ఒక కారణంగా మారింది. ముఖ్యంగా కరెంట్ వాడకం పెరిగింది. సామాన్య మానవుడి ఇంట్లో ఉండే నిత్యావసర వస్తువుల దగ్గర నుంచి ప్రతీది కరెంట్ మీద ఆధారపడి జీవిస్తున్నారు. క్షణం ఫ్యాన్ లేనిదే ఉండలేకపోతున్నారు. 24 గంటలు టీవీ, ఫ్యాన్లు నడుస్తూనే ఉన్నాయి. ప్రతీ ఇంట్లో కూలర్, నీళ్లకు మోటార్ ప్రతీది కరెంట్ మీద ఆధారపడటంతో విద్యు త్ వినియోగం కూడా పెరిగింది. దీంతో ఈ లోవోల్టేజీ సమస్య తీవ్రంగా మారింది. ఉచిత విద్యుత్ కారణంగా పట్టణాల్లో విలాసాలకు అలవాటు పడిపోయారు. ప్రతీ 10 ఇళ్లల్లో ఒకరు ఏసీ వాడుతున్నారు. వాషింగ్ మిషన్లు, కుక్కర్లు, మిక్సీ, గ్రైండర్ వంటి విలాసాలతో విద్యుత్ వినియోగం విపరీతంగా పెరిగింది. ఏది ఏమైనా వేసవి కాలంలో కరెంటు కోతలతో, లోవోల్టేజీ సమస్యతో ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి ఈ లోవోల్టేజీ సమస్య లేకుండా, విద్యుత్ కోతలు లేకుండా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

కాలిపోతున్న ఎలక్ట్రిక్ వస్తువులు

లో వోల్టేజీ సమస్యతో ఇళ్లల్లోని విద్యుత్ పరికరాలు, ఎలక్ట్రిక్ వస్తువులు కాలిపోతున్నాయి. ముఖ్యంగా ఈ లోవోల్టేజీ సమస్యతో ఫ్యాన్లు, కూలర్లు, రిఫ్రిజిరేటర్లు ఎక్కువగా కాలిపోతున్నాయి. అంతే కాకుండా కరెంట్ కోతలతో కరెంట్ వచ్చిపోయిన ప్రతిసారీ లోవోల్టేజీ నుంచి ఒకే సారి హైవోల్టేజీ రావడంతో ఈ సమస్య తీవ్రంగా ఉంది.

కరెంటు కోత విధిస్తున్నారు.



చండూరు మునిసిపాలిటీలో కరెంట్ కోతలు అధికంగా ఉన్నాయి. దానికి తోడు లోవోల్టేజీ కరెంటు రావడంతో ఫ్యాను, కూలర్లు తిరగడానికి మొరాయిస్తున్నాయి. రాత్రి సమయంలో ఫ్యాన్, కూలర్ ఫుల్ స్పీడ్‌గా పెట్టినా తిరగలేక తిరగలేక తిరుగుతున్నాయి. వాటికంటే విసనకర్రలు మేలు. ఫ్యాన్లు తిరగక దోమలతో రాత్రిళ్లు యుద్ధం చేయాల్సి వస్తుంది. దయచేసి అధికారులు స్పందించి కరెంట్ లోవోల్టేజీ సమస్యను పరిష్కరించి నాణ్యమైన కరెంట్ అందించాలి.

-భీమనపల్లి ముత్యం, చండూరు

లోవోల్టేజీ కరెంట్‌తో ఇబ్బందులు



కరెంట్‌తో లోవోల్టేజీ సమస్యతో గ్రామంలో ఇబ్బందులు పడుతున్నాం. ముఖ్యంగా మధ్యాహ్నం, రాత్రి సమయంలో ఈ సమస్య తీవ్రంగా ఉంటుంది. దీనికి తోడు కరెంట్ కోతలు కూడా ఎక్కువయ్యాయి. అంతే కాకుండా సింగిల్ ఫేస్ కరెంట్ రావడంతో ఫ్యాన్లు, కూలర్లు కాలిపోతున్నాయి. సింగిల్ ఫేస్ విద్యుత్ సరఫరా మార్చి త్రీఫేస్ కరెంట్ ఇవ్వాలి.

- కొశమల్ల అనిల్‌కుమార్, తుమ్మలపల్లి

సమస్య పరిష్కారానికి కృషి

చండూరు మండలంలో ఎక్కువగా సమస్యలు లేవు. ఇప్పటి నా దృష్టికి రాలేదు. ఒక వేళ ఫిర్యాదు వస్తే వెంటనే పరిష్కరిస్తాం. చండూరు మునిసిపాలిటీలో కొన్ని ప్రాంతాల్లో లోవోల్టేజీ సమస్య ఉంది. మండలానికి కొన్ని 100కేవీలైన్లు మంజూరయ్యాయి. వాటిని అతి త్వరలో ఏర్పాటు చేసి మండలంలో ఈలోవోల్టేజీ సమస్య తలెత్తకుండా చూసుకుంటాం.

- ప్రవీణ్‌రెడ్డి, ఇన్‌చార్జి ఏఈ, చండూరు

సార్వత్రిక సమ్మెకు నోటీసులు



సమ్మె నోటీసు అధికారులకు అందజేస్తున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

నల్లగొండరూరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా మే 20 చేపట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీరాజ్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ఇతర జిల్లా వివిధ శాఖల అధికారులకు సమ్మె నోటీసులను శుక్రవారం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ 10 కేంద్ర కార్మిక సంఘాలు, కేంద్ర ప్రభుత్వం ఉద్యోగ ఫెడరేషన్లు దేశవ్యాప్తంగా చేస్తున్న సార్వత్రిక సమ్మెలో కార్మికవర్గం అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, నాయకులు పోలే సత్యనారాయణ, ఎల్లేష్ పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి

నార్కట్‌పల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 20వ తేదీన నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చింతపల్లి బయ్యన్న పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఆశా వర్కర్లతో కలిసి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ విజయ్‌కుమార్‌కు సమ్మె నోటీసును అందజేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు తుమ్మల నాగలక్ష్మి, అల్లె కరుణ, సీహెచ్ భాగ్య, ఆదిమల్ల పద్మ, చిక్కుళ్ల పద్మ, మంగమ్మ, నర్సమ్మ, వెంకటమ్మ పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్



శ్రీనివాస్

నార్కట్‌పల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): భారతీయ జనతా పార్టీ నార్కట్‌పల్లి మండల అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన మేడబోయిన శ్రీనివాస్‌యాదవ్ నియమితులయ్యారు. శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి నియామకపత్రం అందజేశారు. తనపై ఎంతో విశ్వాసంతో ఇచ్చిన బాధ్యతలను శక్తివంచన లేకుండా నిర్వర్తిస్తానని, మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. నార్కట్‌పల్లి పట్టణానికి చెందిన నడింపల్లి శ్రవణ్‌కుమార్ బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యునిగా నియమితులయ్యారు. కాగా తన నియామకానికి సహకరించిన ప్రతీ ఒక్కరికీ శ్రవణ్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ వన్‌టౌన్ అధ్యక్షుడిగా గడ్డం మహేష్



శ్రీనివాస్

రామగిరి, మే 2(ఆంధ్రజ్యోతి): బీజేపీ వన్ టౌన్ అధ్యక్షుడిగా పట్టానికి చెందిన గడ్డం మహేష్‌ను నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి నియామక ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మహేష్‌కు శాలువా కప్పి అభినందించారు. పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ తన నియమాకానికి సహకరించిన వారికి ప్రతి ఒక్కరి ధన్యవాదాలు తెలిపారు.

పశువులకు గాలికుంటు టీకాలు వేయించాలి



బీమారంలో పశువులకు గాలికుంటు టీకాలు వేస్తున్న పశువైద్య సిబ్బంది

కేతేపల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సీజన్‌లో పశువుల్లో సోకే గాలికుంటు వ్యాధి నివారణ కోసం పశు పోషకులు తమ పశువులకు టీకాలు వేయించుకోవాలని బీమారం పశు వైద్యాధికారి రసూల్ సూచించారు. మండలంలోని బీమారం, వివిధ గ్రామాల్లో శుక్రవారం పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో మరో రెండు రోజులు పాటు టీకాలు వేసే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. గ్రామంలో దాదాపు వంద పశువులకు టీకాలు వేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది సౌజన్య, సైదమ్మ, నవనీత, గోపాలమిత్రలు ఎన్.భిక్షం, శంకర్, అరవింద్ పాల్గొన్నారు.

పదిలో మైనార్టీ గురుకులాల హవా



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నల్లగొండ, మే 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఇటీవల వెల్లడించిన 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో మైనార్టీ నల్లగొండ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా 100శాతం ఉత్తీర్ణత సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను శుక్రవారం ప్రిన్సిపాల్ షెహిన్ షేక్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాజ్‌కుమార్, ఆర్ఎల్‌సీ విష్ణుమూర్తి, సురేష్, ఖయ్యూం తదితరులు పాల్గొన్నారు.

కులగణనను స్వాగతిస్తున్నాం



బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో మిఠాయిలను పంచుతున్న సంఘం నాయకులు

నల్లగొండ, మే 2 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం కులగణన చేపట్టాలని కేంద్ర క్యాబినేట్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపేందర్ అన్నారు. నల్లగొండలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. జనాభా దామాషా ప్రకారంగా బీసీ రిజర్వేషన్లు పెంచాలని డిమాండ్ చేశారు. కులగణన ద్వారా 50 శాతం పరిమితి ఎత్తివేసి ఎవరి జనాభా దామాషా ప్రకారం వారికి రిజర్వేషన్ కల్పించాలన్నారు. సమావేశంలో బీసీ యువజన సంఘం జిల్లా కార్యదర్శి ఎలిజాల వెంకటేశ్వర్లు, నియోజకవర్గ అధ్యక్షుడు బోళ్ల నాగరాజు, వనం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ కాలనీవాసులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

- సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న పబ్బు వీరస్వామి

నల్లగొండటౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): నల్లగొండ పట్టణంలోని దేవరకొండ రోడ్డులో గల ముత్యాలమ్మ కాలనీ వాసులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పబ్బు వీరస్వామి డిమాండ్ చేశారు. పట్టణంలోని 11వ వార్డులోని ముత్యాలమ్మ కాలనీలో శుక్రవారం నిర్వహించిన సమావేశం నిర్వహించారు. టౌన్ కార్యదర్శి గాదెపాక రమేష్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం జరిగిన మహాసభలో వీరస్వామి మాట్లాడుతూ ముత్యాలమ్మ కాలనీవాసులు ఇళ్ల పట్టాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి వెంటనే పట్టాలు అందజేసి వారి సమస్యను పరిష్కరించాలని అన్నారు. పట్టణంలోని నిరుద్యోగులు ప్రభుత్వం విడుదల చేసిన రాజీవ్ యువవికాసంకు వేలాదిగా రుణాల కోసం ఆన్‌లైన్, ఆఫ్ లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. దరఖాస్తుల చేసుకున్న వారికి కార్పొరేషన్ల ద్వారా రుణాలు మంజూరు చేయాలని కోరారు. గత ప్రభుత్వం నుంచి ఎంతోమంది రేషన్‌కార్డులు నోచుకోక ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే దరఖాస్తు చేసుకున్న ప్రతీ కుటుంబానికి రేషన్‌కార్డు ఇవ్వాలన్నారు. పట్టణంలో తాగునీటి కొరత ఉన్న ప్రాంతాల్లో మునిసిపాలిటీ ట్యాంకుల ద్వారా నీటిని సరఫరా చేయాలన్నారు. మహాసభలో నాయకులు పుట్టమేలా సుజాత, ఎం.కౌసల్యానాయక్, జె.విజయ, హైమావతి, మాధవి, విశ్వనాథుల లెనిన్, బోగరి రాంకోటి, ఇద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

కళాభారతి నిర్మాణాన్ని వెంటనే చేపట్టాలి



కళాభారతి కోసం గత ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రతిని విడుదల చేస్తున్న కళాకారులు

నల్లగొండ కల్చరల్, మే 2 (ఆంధ్రజ్యోతి): నల్లగొండలో సాహిత్య, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు వెంటనే కళాభారతిని వెంటనే నిర్మించాలని పలువురు కవులు, కళాకారులు, సామాజికవేత్తలు కోరారు. నల్లగొండ పట్టణంలోని టీఎన్జీవోస్ భవనంలో శుక్రవారం సాయంత్రం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోమలి కళా సమితి అధ్యక్షుడు బక్క పిచ్చయ్య, సృజన సాహితి సంస్థ అధ్యక్షుడు పెరుమాళ్ల ఆనంద్, తెలుగుశాఖ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణ కౌండిన్య, సాహితీవేత్తల జిల్లా అధ్యక్షుడు పున్నం అంజయ్య మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన కవులకు, కళాకారులకు ఉమ్మడి నల్లగొండ జిల్లా కేంద్రంలో తగిన వేదిక లేపోవడం దురదృష్టకరమన్నారు. నల్లగొండ పట్టణంలో కళాభారతి నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.90 కోట్ల రూపాయలు కేటాయించిందని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం నిర్మాణం చేపట్టే విషయంలో నిర్లక్ష్యం చేస్తుందన్నారు. వెంటనే కళాభారతిని నిర్మాణం చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కవులు, కళాకారులు, సాహితీవేత్తలు బండారు శంకర్, కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, శీలం భద్రయ్య, పన్నాల గోపాల్‌రెడ్డి, బీమార్జున్ రెడ్డి, రంగనాయకుడు, గజవెల్లి సత్యం, సాగర్ల సత్తయ్య, మదుసూదన్, గణేష్ పాల్గొన్నారు.

లిటిల్ సోల్జర్స్ ప్రతినిధులకు యంగ్ ఇండియా పురస్కారం



యంగ్ ఇండియా పురస్కారాన్ని అందుకుంటున్న నరేష్

నకిరేకల్, మే 2(ఆంధ్రజ్యోతి): యంగ్ ఇండియా 2025 సేవా పురస్కారాన్ని నకిరేకల్‌కు చెందిన లిటిల్ సోల్జర్స్ ప్రతినిధులు బ్రహ్మదేవర నరేష్, కర్నాటి నరేష్ అందుకున్నారు. హైదరాబాద్‌లోని నాంపల్లి నెహ్రూ ఆడిటోరియంలో హెచ్ఎండబ్ల్యూఎస్, ఎస్టీ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నట్లు తెలిపారు. ఏడేళ్లుగా చిన్నారుల వైద్యానికి సాయం, అనాథ ఆశ్రమాలకు చేయూత, రక్తదాతలకు ప్రోత్సాహం, పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ, నేత్రదానం, అవయవాల దానం, నిరుద్యోగులకు ఉచిత స్టడీహాల్, పర్యావరణ పరిరక్షణకు వారు కృషి చేస్తున్నారు.

బొడ్డు సత్తయ్య జీవితం యువతకు ఆదర్శం

- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



సత్తయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, నాయకులు

చండూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): బొడ్డు సత్యం జీవితం యువతకు ఆదర్శమని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. గొల్ల, కురుమ సంఘం మునుగోడు నియోజకవర్గ కన్వీనర్ బొడ్డు సత్తయ్యయాదవ్ వర్థంతి సందర్భంగా చండూరులో ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని శుక్రవారం ఎమ్మెల్సీ ఆవిష్కరించి, నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సామాజిక ఉద్యమాల వల్లనే, కేంద్ర ప్రభుత్వం గుర్తించి దేశవ్యాప్తంగా కులగణనకు ముందుకు వచ్చిందన్నారు. సత్తయ్య మారుమూల పల్లెలో పుట్టి దృఢ సంకల్పంతో అడుగు బలహీన వర్గాలకు సాయం చేస్తూ సామాజిక అభివృద్ధి కోసం పాటు పడిన వ్యక్తి అని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాసం వెంకటేశ్వర్లు, విశ్రాంత ఏఎస్ చొల్లేటి ప్రభాకర్, యాదవ సంఘం నియోజకవర్గ నాయకుడు జక్కలి ఐలయ్యయాదవ్, దోటి వెంకటేశంయాదవ్, బూడిద లింగయ్యయాదవ్, అచ్చిని శ్రీనివాస్, నాయకులు నలుపరాజు రామలింగయ్య, శ్రీనివాస్ యాదవ్, అబ్బనబోయిన చందు యాదవ్, అయోధ్యయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే వీరేశానికి మంత్రి తుమ్మల శుభాకాంక్షలు



ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి తుమ్మల

నకిరేకల్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే వేముల వీరేశం నకిరేకల్‌లో నూతనంగా నిర్మించుకున్న ఇల్లు ఈ నెల 4వ తేదీన గృహప్రవేశం చేయనున్నారు. ఈ నేపథ్యంలో ముందస్తుగా శుక్రవారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఇంటిని సందర్శించి ఎమ్మెల్యే వేముల వీరేశం పుష్ప దంపతులు, కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

భద్రకాళిదేవిగా రేణుకా ఎల్లమ్మ



భద్రకాళి అలంకరణలో అమ్మవారు

కనగల్, మే 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీ వద్ద గల శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో వైశాఖమాసం పంచమి పురస్కరించుకుని అమ్మవారు శుక్రవారం భక్తులకు భద్రకాళీదేవిగా దర్శనమిచ్చారు. ముఖ్య అర్చకులు మల్లాచారి ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు జరిపించారు. అమ్మవారికి ఇష్టమైన వారం శుక్రవారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమ అభిషేక పూజలు జరిపించి చీరసారె ఒడిబియ్యం బోనస్నైవేద్యాలను అందజేసారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ కమిటీ చైర్మన్ చీదేటి వెంకట్ రెడ్డి, ఈవో జయరామయ్య ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

శ్రీ చేతన విద్యార్థులకు ఎమ్మెల్యే అభినందన

నార్కట్‌పల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన నార్కట్‌పల్లిలోని శ్రీ చేతన పాఠశాల విద్యార్థులను ఎమ్మెల్యే వేముల వీరేశం శుక్రవారం తన నివాసంలో అభినందించారు. మండలంలో 574 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన దీరజ్ అనే విద్యార్థితో పాటు 559 మార్కులు సాధించిన కీర్తితో పాటు 500లకు పైగా మార్కులు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే అభినందించారు.

డ్రైవర్స్ యూనియన్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా సైదులు



సైదులు

శాలిగౌరారం, మే 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్వయంకృషి డ్రైవర్స్ యూనియన్ మండల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడు గుదే సైదులు, ఉపాధ్యక్షుడు రూపని సాయి, కార్యదర్శి గండమల్ల సతీష్, సహాయ కార్యదర్శి గండమల్ల భరత్, కోశాధికారి జంపాల నరేష్, ప్రచార కార్యదర్శిగా టేకుల వెంకన్న, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బొడ్డు శంకర్ ఎన్నికయ్యారు.

మృతుని కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే ఆర్థికసాయం

కట్టంగూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): కట్టంగూరుకు చెందిన బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా మండల అధ్యక్షుడు గోగు బాల సైదులు గురువారం అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య శుక్రవారం కట్టంగూరులో ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 20వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మా జీ జడ్పీటీసీ తరాల బలరాం, నాయకులు పోగుల నర్సింహ, పెద్ది బాలనర్సింహ, అంతటి శ్రీను, నోముల వెంకటేశ్వర్లు, మనోహర్, ఐతగోని సైదులు, రాచకొండ యాద య్య తదితరులు పాల్గొన్నారు.

ఖాజాఆరీఫుద్దీన్‌కు మునిసిపల్ కమిషనర్‌గా పదోన్నతి



ఖాజాఆరీఫుద్దీన్

రామగిరి, మే 2 (ఆంధ్రజ్యోతి): దేవరకొండ మునిసిపల్ కార్యాలయంలో మేనేజర్‌గా పనిచేస్తున్న ఖాజా ఆరీఫుద్దీన్ మునిసిపల్ కమిషనర్‌గా పదోన్నతి కల్పిస్తు ప్రభుత్వం ఉత్వర్వులను జారీ చేసింది. వారం రోజుల్లో బాధ్యతలు తీసుకోనున్నారు.

పార్టీ బలోపేతానికి కృషి : మురళి



గర్రె మురళి

నకిరేకల్, మే 2 (ఆంధ్రజ్యోతి): బీజేపీ నకిరేకల్ పట్టణాధ్యక్షుడిగా గర్రె మురళిని నియమిస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈసందర్భంగా మురళి మాట్లాడుతూ పదవికి సహకరించిన జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నకిరేకల్ అసెంబ్లీ ఇన్‌చార్జి నకిరేకంటి మొగిలయ్య, గొంగిడి మనోహర్‌రెడ్డి, మాదగోని శ్రీనివాస్, గోలి మధుసూదన్‌రెడ్డి, వీరవెల్లి చంద్రశేఖర్, నూకల వెంకటనారాయణరెడ్డి, నూకల నర్సింహారెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి

***

ANDHRAJYOTHY

నల్లగొండ

5

శనివారం 3 మే 2025

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ :18004251442

యాదాద్రి :1800 425 7106

సూర్యాపేట :1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 66

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.162	240	270
సూర్యాపేట	రూ.165	220	250
నల్లగొండ	రూ.155	215	240

ఉష్ణోగ్రత గరిష్ఠం 41.0 । కనిష్ఠం 24.0



బత్తాయి ధర పతనం

» బత్తాయి టన్ను రూ.18వేలు » చరిత్రలో ఇదే మొదటి సారి » సాగులోనూ కష్టాలు » ఆందోళనలో రైతాంగం



ఈ రైతు పేరు కరణం మల్లికార్జున్. అనుముల మండలం హాలియా గ్రామంలో 15 ఏళ్లుగా 10 ఎకరాల్లో బత్తాయి సాగు చేస్తున్నాడు. ఒకప్పుడు బత్తా యి సాగు వ్యయం తక్కువగా ఉండగా, దిగుబడి బాగా వచ్చేది. దీంతో ఆదాయం కూడా బాగానే ఉండే ది. ఐదేళ్లుగా వాతావరణంలో మార్పుల కారణంగా మం గునల్లి వంటి తెగుళ్ల వ్యాప్తి అధికమై దిగుబడులు బాగా తగ్గాయి. ఎకరానికి సాధారణంగా 10 టన్నుల దిగుబడులు వచ్చేది. ప్రస్తుతం కత్తెర కాయ టన్నుకు మించి కూడా దిగుబడి రావడం లేదు. సీజన్‌లో ఐదు టన్నుల దిగుబడి రావడం కష్టంగా మారింది. ఎకరానికి రూ.50వేలకు పైన పెట్టుబడులు పెట్టాల్సి వస్తోంది. దిగుబడులు తక్కువగా వస్తున్న నేపథ్యంలోనే ధరలు కూడా బాగా పడిపోయాయి. ఏటా కత్తెర కాయ టన్నుకు కనీసం రూ.40వేల నుంచి రూ.50వేల వరకు ధర పలికేది. ప్రస్తుతం రూ.18వేలకు ఎవరూ కొనుగోలు చేయడం లేదు. సీజన్ కాయ ఆశించిన స్థాయిలో లేదు. ఈ ఏడాది కనీసం పెట్టుబడులు కూడా వచ్చేది కష్టంగా మారింది. దీంతో బత్తాయి సాగు నష్టం మిగులుస్తోందని రైతు వాపోతున్నాడు.

బత్తాయికి గడ్డుకాలం ఏర్పడింది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా బత్తాయి ధర పతనమైంది. ఏటా భారీగా బత్తాయి సాగు విస్తీర్ణం పడి పోతుండగా, అదే స్థాయిలో ధరలు తగ్గడంతో రైతుల్లో ఆందోళన మొదలైంది. సాగు ఖర్చులు పెరగడంతో పాటు ప్రతికూల వాతావరణ ప్రభావంతో తెగుళ్ల వ్యాప్తి రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది.

-(ఆంధ్రజ్యోతి,మిర్యాలగూడ వ్యవసాయం)

బత్తాయి సాగులో రెండు దశాబ్దాలుగా వేసవిలో వచ్చే కత్తెర కాయకు ఎనలేని డిమాండ్ ఉండేది. సాధారణంగా కత్తెర కాయ దిగుబడి చాలా తక్కువగా వస్తుంది. జ్యూస్ వినియోగం అధికంగా ఉండటం, కాయ దిగుబడి తక్కువగా ఉండటంతో డిమాండ్ అధికంగా ఉంటుంది. ఏప్రిల్-మే నెలలో సాధారణంగా టన్ను బత్తాయికి రూ.40వేల నుంచి రూ.50వేల వరకు ధర పలుకుతుం ది. ప్రస్తుతం టన్నుకు రూ.18వేలకు మించి ధర లేదు. ఇక్కడి బత్తాయి ఉత్తర భారతదేశంలోని ఢిల్లీ, ఆగ్రా, జైపూర్, కలకత్తా, ముంబై తదితర ప్రాంతాలకు ఎగుమతి అవుతుంది. అక్కడ అకాల వర్షాలు పడుతుండటంతో పాటు కాయ వినియోగం పడిపోయిందని వ్యాపారులు చెబుతున్నారు.

రాయలసీమ ఎఫెక్ట్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాయలసీమ

మిగతా 7వ పేజీలో...

ప్రోత్సాహం ఏదీ?

తక్కువ నీటితో అధిక విస్తీర్ణంలో సాగయ్యే బత్తాయికి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరువైంది. స్థానికంగా మార్కెట్ ఏర్పాటు చేయకపోవడంతో పాటు సబ్సిడీలు అందించకపోవడం, సాగు యాజమాన్య పద్ధతులపై సరైన సూచనలు కరువయ్యాని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బత్తాయికి బీమా వర్తింపజేయకపోవడంతో ఉమ్మడి జిల్లాలో తోటలు అంతరించే దశలో ఉన్నాయి.

సాగు దుర్భరం

జిల్లాలో సుమారు 40వేల ఎకరాల్లో బత్తాయి సాగు ఉందని ఉద్యానశాఖ అధికారుల గణాంకాలు వెల్లడిస్తుండగా, 20వేలకు మించి సాగు ఉండదని తెలుస్తోంది. బత్తాయిలో రెండేళ్లుగా కత్తెర కాయ దిగుబడులు రావడం లేదు. సెప్టెంబరు-అక్టోబరులో చెట్లు వాడు పెడితేనే కత్తెర కాయ దిగుబడులు వస్తాయి. రెండేళ్లుగా ఈ సమయంలో వర్షాలు పడుతుండటంతో దిగుబడులు పూర్తి స్థాయిలో పడిపోయాయి. చాలా ప్రాంతాల్లో 10 ఎకరాలకు 2టన్నుల నుంచి 3టన్నులు దిగుబడులు రాలేదని రైతులు వాపోతున్నారు. వచ్చిన కొద్ది కాయకు విపరీతమైన మంగు ఉంది. కాండాలకు పచ్చని పాకురు, వేరుకుళ్లు, పూత దశలో తామర పురుగులు, త్రిప్స్ వస్తుండటంతో చెట్లు చనిపోతున్నాయి. పెట్టుబడులు పెడుతున్నా చెట్లు కోలుకోవడం లేదు.



లష్కర్, హెల్పర్ల నియామకాలకు కసరత్తు

నీటిపారుదలశాఖ నల్లగొండ డివిజన్ పరిధిలో లష్కర్లు, హెల్పర్ల నియామకాల కోసం కసరత్తు సాగుతోంది. ఈ ఉద్యోగాలను ఔట్‌సోర్స్ ద్వారా నియమించాలని నీటిపారుదలశాఖ నిర్ణయించడంతో ఔట్‌సోర్స్ ఏజెన్సీలను ఎంపికచేసే ప్రక్రియ ప్రారంభమైంది. నల్లగొండ జిల్లా ఉపాధికల్పన కార్యాలయంలో ఎంప్యానల్ అయిన ఔట్‌సోర్స్ ఏజెన్సీల నుంచి గత నెల 19వ తేదీ వరకు దరఖాస్తులు తీసుకున్నారు.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

» ఔట్‌సోర్స్ ఏజెన్సీ ఎంపికకు లాటరీ
» కాంట్రాక్ట్ కోసం 62 ఏజెన్సీల దరఖాస్తు
» దక్కించుకునేందుకు తెరవెనుక ప్రయత్నాలు
» నామినేటెడ్‌కు నో చెప్పిన ఉన్నతాధికారులు
» నిరుద్యోగులు మోసపోవద్దు : జిల్లా ఉపాధికల్పనాధికారి పద్మ

జిల్లాలో 97 ఏజెన్సీలు ఉండగా, 62 ఏజెన్సీలు దరఖాస్తు చేసుకున్నాయి. నోటిఫికేషన్ ద్వారా ఎంపికయ్యే ఏజెన్సీ నుంచి 229 లష్కర్ పోస్టులు, ఆరు హెల్పర్ల పోస్టుల నియామకాలు చేపట్టనుండడంతో ఈ కాంట్రాక్ట్ కోసం ఏజెన్సీలు తెరవెనక ప్రయత్నాలు సైతం చేస్తున్నట్లు తెలిసింది. అయితే ఏజెన్సీల ఎంపికను లాటరీ ద్వారా చేపట్టాలని ఎంప్యానల్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరించే కలెక్టర్ నిర్ణయించడంతో, లాటరీ ప్రక్రియ కోసం దరఖాస్తు చేసుకున్న ఏజెన్సీలు అందుకు ఎదురుచూస్తున్నాయి. మరోవైపున ఏజెన్సీ ఇంకా ఖరారు కాకపోయినా నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో ఈ ఉద్యోగాల కోసం నేరుగా సీఈ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటుండగా, మరికొందరు రాజకీయనేతల చుట్టూ పైరవీల కోసం ప్రదక్షిణలు చేస్తున్నారు.

లాటరీ కోసం ఏజెన్సీల ఎదురుచూపు

లష్కర్, హెల్పర్ ఉద్యోగాల నియామక, నిర్వహణ బాధ్యతలుండే ఏజెన్సీని ఎంపికచేసే లాటరీ ప్రక్రియ కోసం ఏజెన్సీల నిర్వాహకులు ఎదురుచూస్తున్నారు. అదనపు కలెక్టర్‌కు ఈ బాధ్యతలను అప్పగించడం, ఆయన సెలవులో ఉండడంతో ఇన్‌చార్జిగా ఉన్న మిర్యాలగూడ సబ్‌కలెక్టర్ సమక్షంలో ఉపాధికల్పన అధికారి ఈ లాటరీ నిర్వహించనున్నారు. అందుకోసం ఇంకా తేదీ ఖరారు కాలేదు. లాటరీ నిర్వహించే తేదీని నిర్ణయించిన తర్వాత కలెక్టర్ అనుమతితో దరఖాస్తు చేసుకున్న ఏజెన్సీలకు సమాచారం ఇస్తారు. లాటరీలో ప్రాధాన్యక్రమంలో ఐదు ఏజెన్సీలను ఎంపిక చేస్తారు. ఎంపికైన ఏజెన్సీకి లేబర్ లైసెన్స్‌తో పాటు ఇతర అర్హతలున్నాయా? లేదా? అనే అంశాన్ని పరిశీలిస్తారు. అంతేకాకుండా ఎంపికైన ఏజెన్సీ పీఎఫ్ గతంలో నిర్వహించిన కాంట్రాక్టులకు సంబంధించిన ఎంప్లాయర్స్ నుంచి నోడ్యూస్, క్లియరెన్స్ సర్టిఫికెట్లు సమర్పించాల్సి ఉంటుంది. డిఫాల్టర్ అయితే సంబంధిత ఏజెన్సీకి ఈ కాంట్రాక్ట్ ఇవ్వకుండా తప్పించి, తదుపరి ఉన్న ఏజెన్సీని పరిశీలిస్తారు. ఇలా పూర్తి పారదర్శకంగా ఏజెన్సీని ఎంపికచేసే ప్రక్రియ కొనసాగించాలని ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు తెలిసింది. నామినేటెడ్‌పై ఏజెన్సీలకు కాంట్రాక్టులు ఇస్తే కాంట్రాక్ట్ రాని ఏజెన్సీలు కోర్టులను ఆశ్రయించడం వంటి కారణాలతో ఇబ్బందులు వస్తున్న నేపథ్యంలో పూర్తిపారదర్శకంగా ఉండేందుకే లాటరీ విధానాన్ని తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఏజెన్సీని దక్కించుకునేందుకు తెరవెనక ప్రయత్నాలు

కీలకమైన నీటిపారుదలశాఖలో ఔట్‌సోర్స్ కాంట్రాక్ట్ కావడంతో దీన్ని దక్కించుకునేందుకు ఏజెన్సీల నిర్వాహకులు కొందరు తెరవెనక ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఇతర జిల్లాల్లో మాదిరిగా నామినేటెడ్ పద్ధతిలో ఏజెన్సీని ఎంపికచేయాలని ఉన్నతాధికారులను కోరుతున్నారు. ఇందుకోసం కీలక ప్రజాప్రతినిధుల ద్వారా పైరవీలు ప్రారంభించారు. ఏజెన్సీని ఇప్పిస్తే, ఉద్యోగాలు ఆశించే అభ్యర్థుల నుంచి డబ్బు వసూలు చేసి అందులో సగం వరకు కాంట్రాక్ట్ ఇప్పించేవారికి ఇస్తామని సదరు ఏజెన్సీల నిర్వాహకులు కీలకమైన ప్రజాప్రతినిధులను ఆశ్రయించినట్లు తెలిసింది. అయితే కలెక్టర్ సహా ఉన్నతాధికారులు పూర్తి పారదర్శకంగా లాటరీ ద్వారా ఏజెన్సీని ఎంపిక చేస్తామని తేల్చి చెప్పడంతో పాటు, టాప్ ప్రయార్టీలో ఏజెన్సీలను ఎంపికచేసి, అన్ని అర్హతలున్నాకే బాధ్యతలిస్తామని చెబుతున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. అంతేకాకుండా ఉద్యోగాలు ఆశించే నిరుద్యోగులు ఎవరూ ఎలాంటి ప్రలోభాలకు లొంగవద్దని, ఏజెన్సీని ఎంపికచేశాకే ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ ఇస్తామని స్పష్టం చేస్తున్నారు. దీంతో ఏజెన్సీని ఎలాగైనా దక్కించుకోవాలనే నిర్వాహకులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

పారదర్శకంగా ఏజెన్సీల ఎంపిక

- పద్మ, జిల్లా ఉపాధికల్పనా అధికారి

నల్లగొండ జిల్లాలోని నీటిపారుదలశాఖ సీఈ కార్యాలయ పరిధిలో లష్కర్, హెల్పర్ ఉద్యోగాల నిర్వహణకు ఔట్‌సోర్స్ ఏజెన్సీని పారదర్శకం గా ఎంపిక చేస్తాం. జీవో ప్రకారం ఎంపిక ప్రక్రి య ఉండాలనే ఉద్దేశంతో కలెక్టర్ సూచనలమేరకు లాటరీ విధానం ఉంటుందని నోటిఫికేషన్ ఇచ్చాం. 62 ఏజెన్సీలు దరఖాస్తు చేసుకున్నా యి. కలెక్టర్ నిర్ణయించిన తేదీ ప్రకారం లాటరీ తేదీని తెలియజేస్తాం. లాటరీలో ఎంపికైన ఏజెన్సీకి సంబంధించి అన్ని పత్రాలు, నోడ్యూస్ సర్టిఫికెట్లు, డిఫాల్టర్ అయితే ఆ విషయా లన్నింటినీ పరిశీలించిన తర్వాతే ఏజెన్సీని ఖరారు చేస్తాం. లాటరీలో ఎంపికైనా, అనర్హులైతే తదుపరి వచ్చేవారికి అవకాశం కల్పిస్తాం. ఎక్కడా తప్పులకు, పొరపాట్లకు ఆస్కారం లేకుండా ఎంపికచేస్తాం. ఏజెన్సీ ఖరారయ్యాక ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ విడుదల చేస్తాం. దాని ప్రకారమే నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలి. ఉద్యోగాల ఎంపిక కూడా నిబంధనల ప్రకారమే జరుగుతుంది. మాయమాటలు నమ్మి నిరుద్యోగులు మోసపోవద్దు.

ఏజెన్సీని ఎంపిక చేశాకే ఉద్యోగాల కోసం నోటిఫికేషన్

తాజా నోటిఫికేషన్ ప్రకారం లష్కర్, హెల్పర్ల ఉద్యోగాలకు ఏజెన్సీ నియామకం పూర్తయ్యాకే ఉద్యోగాల కోసం నోటిఫికేషన్ ఇస్తారు. ఆ నోటిఫికేషన్‌లో సూచించిన ప్రకారమే ఉద్యోగాలకు అభ్యర్థులు దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది. ఈ విషయంపై అవగాహన లేకపోవడంతో పలువురు నిరుద్యోగులు, అర్హులైన వారు ఉద్యోగాల కోసం ఇప్పటికే నీటిపారుదలశాఖ డివిజన్ కార్యాలయంలో దరఖాస్తులు ఇస్తున్న పరిస్థితి నెలకొంది.

లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ చేపట్టాలి

రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టౌన్, మే 2 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా ప్రతీ నియోజకవర్గానికి కేటాయించిన 3,500 ఇళ్లకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేపట్టాలని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో కలిసి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. లబ్ధిదారుల ఎంపిక ఎంతవరకు పూర్తయితే అంతవరకు ఏరోజుకారోజు ఇన్‌చార్జి మంత్రుల నుంచి జాబితాకు ఆమోదం తీసుకోవాలని, ప్రతీ నియోజకవర్గంలోని పట్టణ ప్రాంతాలకు 500 కనీసం ఇళ్లను కేటాయించాలన్నారు. ఇంటి నిర్మాణం 400చదరపు అడుగులకు తగ్గకుండా 600 చదరపు అడుగులకు మించకుండా ఉండేలా కలెక్టర్లు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జాబితాలో ఎవరైనా అనర్హులని తేలితే ఇళ్ల నిర్మాణం మధ్యలో ఉన్నా రద్దు చేస్తామన్నారు. గత నెల 17 నుంచి 30వ తేదీ వరకు నాలుగు పైలెట్ మండలాల్లో నిర్వహించిన మాదిరిగానే ఈనెల 5 నుంచి 20వ తేదీ వరకు జిల్లాకో మండలం చొప్పున రెవెన్యూ సదస్సులు నిర్వహించాలన్నారు. ప్రతీ మండలానికి రెండు బృందాలను ఏర్పాటు చేయాలని, స్థానిక తహసీల్దార్‌తో ఒక బృందం, మరో తహసీల్దార్‌తో ఇంకో బృందం ఏర్పాటు చేయాలన్నారు. ఈ బృందాలు గ్రామంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సదస్సులు నిర్వహించాలన్నారు. గ్రామస్థులకు ముందుగానే దరఖాస్తులు అందజేయాలన్నారు. రికార్డులన్నింటినీ బృందాలు వెంట తీసుకువెళ్లాలన్నారు. అలాగే హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పైలట్ మండలాల్లో వచ్చిన దరఖాస్తులను ఈనెల 31వ తేదీవరకు పరిష్కరించాలని, పరిష్కారం కాని వాటికి ఎందుకు పరిష్కరించడం లేదనే విషయాన్ని లిఖిత పూర్వకంగా తెలియజేస్తూ దరఖాస్తును తిరస్కరించాలని సూచించారు. ప్రభుత్వ భూముల వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమో దు చేయాలని, అసైన్డ్‌ల్యాండ్‌కు సంబంధించి పొజిషన్ మీద ఉండి పట్టా లేనివారు, పట్టా ఉండి పొజిషన్ మీద లేనివారి వివరాలను సేకరించాలన్నారు. వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్లు నారాయణ్‌అమిత్, రాజ్‌కుమార్, అదనపు ఎస్పీ రమేష్, ఆర్డీవో వై.అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి, పాల్గొన్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎస్పీ శరత్‌చంద్ర పవార్

'నీట్'కు ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్

జిల్లాలో ఈ నెల 4న నిర్వహించనున్న నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రెన్స్ టెస్ట్)కు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన మీడియా ప్రతినిధుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నీట్ కోసం జిల్లా కేంద్రంలో ఏడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షకు 2,087 మంది అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. ఎంజీ యూనివర్సిటీలో నాలుగు పరీక్షా కేంద్రాలు, ఎన్జీ కళాశాల, ఉమెన్స్ డిగ్రీ కళాశాల, కేంద్రీయ విద్యాలయంలో మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష రాసే అభ్యర్థులు ఒకరోజు ముందుగానే పరీక్షా కేంద్రాలను చూసుకోవాలన్నారు. ఈ నెల 4న మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్ష ఉంటుందని, అభ్యర్థులు ఉదయం 11 గంటలకే కేంద్రాలకు చేరుకోవాలన్నారు. అభ్యర్థుల బయోమెట్రిక్ అటెండెన్స్ తీసుకుంటామని, మధ్యాహ్నం 1.30గంటలకు పరీక్షా కేంద్రం గేట్లు మూసివేస్తామన్నారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డు, ఇటీవలి దిగిన ఒక పాస్‌పోర్ట్ సైజ్ కలర్ ఫొటో, మరో పోస్ట్‌కార్డ్ సైజ్ కలర్ ఫొటోతో రావాలని తెలిపారు. ఏదైనా ఒక గుర్తింపుకార్డు తీసుకురావాలన్నారు. పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించామన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేశాని, పరీక్ష సమయంలో జిరాక్స్ కేంద్రాల మూసివేత, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా 163వ సెక్షన్ విధిస్తామన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 18004251442కు ఫోన్ చేయాలని సూచించారు.

ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌ను ఖాళీ చేస్తారా?



నిరసన కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

» మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు
» కళాభారతికి కేసీఆర్ పేరును తొలగించినందుకు నిరసన

మిర్యాలగూడ, మే 2(ఆంధ్రజ్యోతి): కళాభారతికి కేసీఆర్ పేరు తొలగించినట్లే బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన క్యాంప్ ఆఫీస్‌ను ఎమ్మెల్యే ఖాళీ చేస్తారా అని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు ప్రశ్నించారు. ఎన్నెస్పీ క్యాంపులో నిర్మించిన మినీ రవీంద్రభారతికి బీఆర్ఎస్ హయాంలో కేసీఆర్ కళాభారతిగా నామకరణం చేయగా, కేసీఆర్ పేరును తొలగించడంతో శుక్రవారం ఆ పార్టీ ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ, కళాభారతి ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్‌రావు మాట్లాడుతూ, రూ.10కోట్లు మంజూరు చేయించి కళాభారతిని నిర్మించి తెలంగాణ ప్రజల ఆత్మ కేసీఆర్ పేరుపెడితే మున్సిపాలిటీలో తీర్మాణం, జీవో లేదనే సాకుతో పేరును తొలగించడం సరికాదన్నారు. తిప్పన విజయసింహారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఎన్నెస్పీ క్యాంప్ గ్రౌండ్‌కు రాజీవ్‌స్టేడియంగా నామకరణం చేశారని, జూలకంటి రంగారెడ్డి కాలంలో సుందరయ్య పార్క్ నిర్మాణం చేశారని, నచ్చకపోతే పేరు మారుస్తారా అని ప్రశ్నించారు. మిర్యాలగూడకు పిడుగురాళ్ల అని పేరు పెట్టి పిలుచుకోండని వ్యంగ్యంగా అన్నారు. పనులు చేసిన వారి పేరును చెరిపివేయడం కాదని, కొత్త పనులు చేసి నచ్చినవారి పేరు పెట్టుకోవాలని సూచించారు. అధికార రాజకీయ నాయకులకు భయపడి అధికారులు తప్పుడు విధానాలకు పాల్పడితే వారే శిక్షను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. వెంటనే అధికారులు కేసీఆర్ పేరును తిరిగి పెట్టాలని, లేనిపక్షంలో ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. రూ.30వేల కోట్లతో తెచ్చిన యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ నిర్వాసితులకు 573 మందికి ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉండగా 116 మందికి కూడా ఇప్పించలేకపోయారని విమర్శించారు. పవర్‌ప్లాంట్‌లో ఓ అవినీతి అధికారి అండతో కోట్ల రూపాయల సామగ్రి తరలిపోగా, ఆ అధికారిపై తాను ఫిర్యాదు చేస్తే ప్లాంట్‌నుంచి బదిలీ చేశారని అన్నారు. అనంతరం మునిసిపల్ కమిషనర్, సబ్‌కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, నాయకులు చింతిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, దుర్గంపూడి నారాయణరెడ్డి, ఎండి.మోసిన్‌అలీ, దానావత్ చిట్టిబాబునాయక్, మట్టపల్లి సైదయ్య, బైరం సంపత్, ఎండి.ఇలియాస్‌ఖాన్, రాములుగౌడ్, కుర్ర చైతన్య, పెండ్యాల పద్మ, షెహనాజ్ బేగం, కోదాటి రమా, ధనమ్మ, ఉమ, ఎండి.షోయబ్, తిరందాసు విష్ణు, మాజీద్, తదితరులు పాల్గొన్నారు.

చేనేత రంగానికి రూ.290 కోట్లు

» భూదాన్‌పోచంపల్లిలోని 'చేనేత సదస్సు'లో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



భూదాన్‌పోచంపల్లిలోని 'పోచంపల్లి ఇక్కత్ పరిశ్రమపై చేనేత సదస్సు'కు హాజరై మాట్లాడుతున్న రాష్ట్ర చేనేత, జౌళీశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భూదాన్‌పోచంపల్లి, మే 2 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం చేనేత రంగాన్ని ప్రోత్సహించేందుకు రూ.290కోట్ల నిధులు పొదుపు పథకానికి విడుదల చేసిందని, చేనేత కార్మికులను ఆదుకునేందుకు రూ.75వేల నుంచి రూ.1.50లక్షల వరకు రుణాలు పొందే అవకాశం కల్పిస్తుందని చేనేత, జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం యాదాద్రి జిల్లా భూదాన్‌పోచంపల్లి పట్టణంలో పోచంపల్లి ఇక్కత్ పరిశ్రమపై 'చేనేత సదస్సు' స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సదస్సులో మంత్రి తుమ్మల మాట్లాడుతూ, రాష్ట్రంలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో చేనేతరంగం నిర్వీర్యమైందన్నారు. సంక్షోభంలో ఉన్న చేనేత రంగాన్ని పరిరక్షించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపుతున్నారన్నారు. పోచంపల్లి చేనేత టైఅండ్‌డై ఇక్కత్ వస్త్రాలు డూప్లికేట్ కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమశాఖల ద్వారా యూనిఫామ్ మెటీరియల్‌ను కొనుగోలు చేయిస్తామన్నారు. ఈ నెల 15న ప్రపంచ సుందరీమణులు భూదాన్‌పోచంపల్లిలో సందడి చేయనున్నారన్నారు. ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ పేరిట అవార్డులు కొనసాగిస్తామన్నారు. చేనేత, జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్ మాట్లాడుతూ ప్రతీ చేనేత కార్మికుడికి రూ.18 వేలు, అనుబంధ కార్మికుడికి రూ.6వేలు జమ చేసే పద్ధతి వచ్చేనెల నుంచి అమల్లోకి వస్తుందన్నారు. సదస్సులో నాయకులు తడక వెంకటేష్, మురళీ మదన్‌గోపాల్ స్వామి, రేఖ బాబురావు, భారత లవకుమార్, గర్దాసు బాలయ్య, తడక రమేష్, పాల్గొన్నారు.

• ఈదురుగాలుల బీభత్సం



కొండమల్లేపల్లిలో ఈదురుగాలులకు కూలిన కారుపై కూలిన చెట్టు

• 6లో..

కులగణనపై కేంద్ర నిర్ణయం చరిత్రాత్మకం



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

రామగిరి, ఏప్రిల్ 2 (ఆంధ్రజ్యోతి): కులగణనపై కేంద్ర క్యాబినెట్ నిర్ణయం తీసుకోవడం చరిత్రాత్మకమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక గడియారం సెంటర్‌లో మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో తీసుకున్న నిర్ణయం బీసీలకు ఉపయోగకరమైనదన్నారు. 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ బీసీల సంక్షేమంపై ఆలోచన చేయకపోవడంతో పాటు అణగదొక్కే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, నాయకులు వీరెల్లి చంద్రశేఖర్, పిల్లి రామరాజు యాదవ్, చింత ముత్యాల్‌రావు, పక్కీర్ మోహన్‌రెడ్డి, పిట్టల శ్రీనివాస్, ఏరుకొండ హరి, మిరియాల వెంకటేశం, దాయం భూపాల్‌రెడ్డి, బిపంగి జగ్జీవన్‌రామ్, పాల్గొన్నారు.

విద్యాసదస్సును విజయవంతం చేయాలి

మట్టి మనుషుల వేదిక కన్వీనర్ వేనేపల్లి

మిర్యాలగూడ, మే 2(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడలో ఈ నెల 3వ తేదీన నిర్వహించే సామాజిక విద్యాసదస్సును విజయవంతం చేయాలని తెలంగాణ మట్టి మనుషుల వేదిక కన్వీనర్ వేనేపల్లి పాండురంగారావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పిల్లలు మానసికంగా ఒత్తిడికి గురికాకుండా, బట్టీ చదువులకు దూరంగా, పసితనం పోగొట్టుకోకుండా పనితనం, సృజన, నైపుణ్యాలు నేర్చుకోవడం ఎలా అనే అంశంపై ఈ సదస్సు ఉంటుందన్నారు. శనివారం సాయంత్రం 3 గంటలకు వైష్ణవీ గ్రౌండ్‌లో నిర్వహించే ఈ సదస్సుకు సామాజిక, విద్యావేత్త వాసిరెడ్డి అమర్‌నాథ్ హాజరవుతారని తెలిపారు.

డీలక్స్ బస్ ప్రయాణికులకు 10శాతం రాయితీ

దేవరకొండ, మే 2(ఆంధ్రజ్యోతి): దేవరకొండ ఆర్టీసీ డిపో పరిధిలో ఆర్టీసీ డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు 10శాతం రాయితీ సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని చేరువ చేసేందుకే ఈ రాయితీ సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకొని ఆర్టీసీ ఆదాయం పెరిగే విధంగా సహకరించాలని కోరారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

నాగార్జునసాగర్, మే 2 (ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 5 నుంచి 12వ తేదీ వరకు పాలిటెక్నిక్ ప్రవేశపరీక్ష రాసే విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఐలయ్య తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలో సీటు సాధించేందుకు విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణ పైలాన్‌కాలనీలోని పాలిటెక్నిక్ కళాశాలలో ఇవ్వనున్నట్లు తెలిపారు. వివరాలకు 9052571315 అనే నంబరును సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

పంచాయతీ భవనాలకు మోక్షమెన్నడో?



ముప్పారంలో అసంపూర్తిగా ఉన్న పంచాయతీ భవనం

- పదేళ్లుగా పూర్తికాని భవనాలు
- నిధులు లేవనే సాకుతో నిలిచిన నిర్మాణాలు
- అసంపూర్తి భవనాల్లోనే కార్యకలాపాలు
- ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు, సిబ్బంది

నిడమనూరు, మే 2 (ఆంధ్రజ్యోతి): నిడమనూరు మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీల భవనాల నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం కారణంగా పంచాయతీల భవనాలు పదేళ్లయినా పూర్తి కావడం లేదు. నిధులు సరిపోవడం లేదనే సాకుతో నిర్మాణాలను మధ్యలోనే వదిలివేసినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. అసంపూర్తిగా ఉన్న పంచాయతీ భవనాలకు మోక్షమెన్నడు లభిస్తుందోనని ఆయా గ్రామాల ప్రజలు, పంచాయతీ సిబ్బంది ఎదురుచూస్తున్నారు. గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు నిర్మించాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం 2015లో మండలంలోని నిడమనూరు, గుంటిపల్లి, ఊట్కూరు, బంకాపురం, ముప్పారం తదితర గ్రామాలకు రూ.16 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. కానీ భవనాలను పూర్తి చేయకుండా, నిధులు సరిపోవడం లేదనే సాకుతో కాంట్రాక్టర్లు నిర్మాణాలను మధ్యలోనే వదిలివదిలేయడంతో భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. బంకాపురం గ్రామ పంచాయతీకి మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అదనంగా రూ. 5 లక్షల నిధులు కేటాయించడంతో ఎలాగోలా నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రారంభించారు. మిగతా వాటికి ఇంతవరకు అదనంగా నిధులు కేటాయింపులు లేకపోవడంతో నిర్మాణాలు అలాగే నిలిచిపోయాయి. మండల కేంద్రమైన నిడమనూరు గ్రామ పంచాయతీ భవనం పదేళ్లుగా పూర్తి కాకపోవడంతో పక్కన ఉన్న పశువుల ఆస్పత్రిలోని చిన్న స్టోర్ రూములో పంచాయతీ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు.

గుంటిపల్లిలో కొత్త భవనం పూర్తి కాకపోవడంతో పాత భవనంలోనే విధులు నిర్వహిస్తున్నారు. ముప్పారం, ఊట్కూరులో అసంపూర్తిగా ఉన్న భవనాలోనే పంచాయతీ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. ముప్పారం పంచాయతీ భవనం పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. నాసిరకంగా నిర్మాణం చేపట్టినట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. నాణ్యతను పట్టించుకోకపోవడంతో అప్పుడే పునాదిలోనే పగుళ్లు ఏర్పడ్డాయి. భవనం అసంపూర్తిగా ఉండటంతో అందులో గబ్బిలాలు కాపురం చేస్తున్నాయి. సిబ్బంది మాత్రం అసౌకర్యాల నడుమ అందులోనే కార్యకలాపాలు కొనసాగించాల్సిన దుస్థితి ఉంది. పైగా పంచాయతీ భవన నిర్మాణానికి సంబంధించిన ఎంబీ (మెజర్‌మెంట్ బుక్) మాయమైనట్లు తెలుస్తోంది. అసంపూర్తిగా ఉన్న పంచాయతీ భవనాల్లోనే విధులు నిర్వహిస్తున్నందున ఆయా గ్రామాల ప్రజలు, పంచాయతీ సిబ్బంది సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుని అదనంగా నిధులు కేటాయించి పంచాయతీ భవనాల నిర్మాణం పూర్తి చేయాలని కోరుతున్నారు.

పంచాయతీ భవన నిర్మాణం పూర్తిచేయాలి



నిలిచిపోయిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని వెంటనే పూర్తి చేసేందుకు ప్రభుత్వం అదనపు నిధులు కేటాయించాలి. గతంలో కేటాయించిన రూ.16 లక్షల ఈజీఎస్ నిధులు సరిపోకపోవడంతో నిర్మాణం పూర్తి కాలేదు. ప్రజల ఇబ్బందుల దృష్ట్యా వెంటనే నిధులు మంజూరు చేసి నిర్మాణాలు పూర్తి చేయాలి.

- మేరెడ్డి వెంకట్‌రెడ్డి, గుంటిపల్లి

నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపాం



మండలంలో నిలిచిపోయిన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం పనులు పూర్తి చేసేందుకు రూ.10 లక్షల చొప్పున అదనపు నిధుల మంజూరు కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాము. నిడమనూరు పంచాయతీకి రూ.10 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులు మొదలు పెడతాం. మిగతా పంచాయతీలకు కూడా నిధులు మంజూరు కాగానే నిర్మాణాలు పూర్తి చేస్తాం.

- సాయిప్రసాద్, పీఆర్ ఏఈ

ఉపాధి కల్పించడమే లక్ష్యం

కంచుకట్ల శ్రీనివాస్, ఏపీవో, నిడమనూరు



ఇంటర్వ్యూ Interview

కూలీలకు పనులు కల్పించడమే ఉపాధి హామీ పథకం లక్ష్యమని, మండలంలో పని అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తున్నామని ఈజీఎస్ ఏపీవో శ్రీనివాస్ అన్నారు. మండలంలో వేసవి సీజన్‌లో చేస్తున్న ఉపాధి పనులు, జాబ్‌కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నర్సరీల గురించి ఆయన మాట్లాడారు.

(ఆంధ్రజ్యోతి - నిడమనూరు)

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎన్ని జాబ్‌కార్డులు ఉన్నాయి? ఎంత మందికి పని కల్పిస్తున్నారు?

ఏపీవో: మండలంలో 11,419 జాబ్‌కార్డులు ఉన్నాయి. 23,555 మంది కూలీలు పనులు చేస్తున్నారు. పని అడిగిన ప్రతి ఒక్కరికీ ఉపాధి హామీ పథకం కింద పని కల్పిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: గత ఏడాది మండలంలో ఉపాధి కింద ఎంత మేరకు పనులు చేపట్టారు?

ఏపీవో: మండలంలో గత ఏడాది రూ.4.80కోట్ల నిధులతో వివిధ గ్రామాల్లో 584 పనులు చేపట్టడం జరిగింది. పనులను సామాజిక తనిఖీ కూడా చేయడం జరిగింది.

ఆంధ్రజ్యోతి: వేసవి సీజన్‌లో ఎలాంటి పనులు చేపడుతున్నారు?

ఏపీవో: ఈ వేసవి సీజన్‌లో మండలంలో ఫీడర్‌చానల్స్ నిర్మాణం, పంట పొలాలలకు రహదారుల ఏర్పాటు, పశువుల పాకలు, ఇంకుడు గుంతల నిర్మాణం తదితర పనులు చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి: కూలీలకు రోజుకు ఎంత కూలీ అందుతుంది?

ఏపీవో: ఉపాధి పనుల కింద కూలీలకు రోజుకు రూ.307 గరిష్ఠంగా అందుతుంది. ప్రస్తుతం రోజుకు రూ.250 వరకు కూలీ చెల్లిస్తున్నాం. ఉపాధి కూలీ ఇటీవల పెరిగింది.

ఆంధ్రజ్యోతి: ఈజీఎస్ సిబ్బంది పనితీరు ఎలా ఉంది?

ఏపీవో: గ్రామాల్లో సిబ్బంది పారదర్శకంగా పని చేస్తూ కూలీలకు పనులు కల్పిస్తున్నారు. మస్టర్లు సక్రమంగా నమోదు చేస్తూ కూలీ అందిస్తున్నారు. ఎలాంటి అవకతవకలకు పాల్పడినా చర్యలు తీసుకుంటామని సిబ్బందిని హెచ్చరించాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎన్ని నర్సరీలు ఉన్నాయి?

ఏపీవో: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో అంటే 29 నర్సరీలు ఉన్నాయి. మొక్కలను సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. 2.48లక్షల మొక్కలు పెంచడం లక్ష్యం.

ఆంధ్రజ్యోతి: ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద ఎంత మందికి లబ్ధి చేకూరింది?

ఏపీవో: మండలంలో పైలెట్ గ్రామమైన తుమ్మడంలో 45మంది కూలీలను ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద లబ్ధిదారులుగా గుర్తించడం జరిగింది.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్లు

దేవరకొండ, మే 2(ఆంధ్రజ్యోతి): దేవరకొండ డివిజన్‌లోని పలు మండలాల్లో శుక్రవారం నూతన తహసీల్దార్లు బాధ్యతలు చేపట్టారు.



కొండమల్లేపల్లి తహసీల్దార్‌గా నరేందర్

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి తహసీల్దార్‌గా ఎం.నరేందర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన అన్వర్‌హుస్సేన్ అడవిదేవులపల్లికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బాధ్యతలు చేపట్టిన ఎం.నరేందర్ మాట్లాడుతూ కొండమల్లేపల్లిలో భూ, రెవెన్యూ సంబంధమైన సమస్యల పరిష్కారానికి తన కృషి చేస్తానని అన్నారు.

గుర్రంపోడు తహసీల్దార్‌గా శ్రీనివాస్



గుర్రంపోడు: గుర్రంపోడు తహసీల్దార్‌గా పి.శ్రీనివాస్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన జి.కిరణ్‌కుమార్ ఫిబ్రవరిలో సస్పెండ్ అయిన విషయం విదితమే. అప్పటి నుంచి తహసీల్దార్ పోస్టు ఖాళీగా ఉండగా ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ మహ్మద్ ఫరీదుద్దీన్ అదనపు బాధ్యతలు నిర్వహించారు. ఆయన స్థానంలో నల్లగొండ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న పి.శ్రీనివాస్ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆయనకు మండల సర్వేయర్ రాంనర్సయ్య, ఆర్ఐ హకీం, ఏఎస్‌వో సాలయ్య, జూనియర్ అసిస్టెంట్లు సందీప్, వెంకటేశ్వర్లు, గోవర్దన్, యాదగిరి, రామకృష్ణ, శ్రీనివాస్, రాంరెడ్డి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

దేవరకొండ తహసీల్దార్‌గా మధుసూదన్‌రెడ్డి

● దేవరకొండ తహసీల్దార్‌గా మధుసూదన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టనున్నారు. దేవరకొండ తహసీల్దార్ సంతోష్‌కిరణ్ మిర్యాలగూడ తహసీల్దార్‌గా బదిలీకాగా, కేతేపల్లి తహసీల్దార్‌గా పనిచేస్తున్న మధుసూదన్‌రెడ్డి దేవరకొండకు బదిలీ అయ్యారు. శనివారం నూతన తహసీల్దార్ పదవీ బాధ్యతలు చేపట్టనున్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా సైదా



సింకారు సైదా



వావిళ్ల అంజి

డిండి, మే 2(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల అధ్యక్షుడిగా సింకారు సైదా, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా వావిళ్ల అంజిని శుక్రవారం ఏకగ్రీవంగా ఎనుకున్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి ఇద్దరిని ప్రకటించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన బీజేపీ మండల అధ్యక్షుడు సైదా మాట్లాడుతూ పార్టీ కోసం చురుకుగా పని చేస్తున్న వ్యక్తులకు బీజేపీలో తగిన గుర్తింపు ఉంటుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. డిండి మండలంలో బీజేపీని బలమైన రాజకీయ శక్తిగా ఎదిగేలా పనిచేస్తానని అన్నారు. ఈ ఎన్నికకు సహకరించిన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, సంస్థాగత ఇన్‌చార్జి కట్ట సుధాకర్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ ఏటీ కృష్ణ, నక్కా వెంకటేష్‌యాదవ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

మురుగునీటికి దారేది?



గొడుకొండ్ల (వెంకటేశ్వరనగర్)లో అధ్వానంగా మారిన మురికికాల్వ

చింతపల్లి, మే 2(ఆంధ్రజ్యోతి): చింతపల్లి మండలంలోని గొడుకొండ్ల (వెంకటేశ్వరనగర్)లో పూర్తిస్థాయిలో మురుగు కాల్వలు లేకపోవడంతో మురుగునీరు కాల్వల్లో నెలల తరబడి నిల్వ ఉంటుంది. దీంతో పాటు గొడుకొండ్ల, ఎం.మల్లేపల్లి, పీ.కే.మల్లేపల్లి, సాయిరెడ్డిగూడెం, కుర్మపల్లి, ఉమ్మాపురం, తక్కళ్లపల్లి, వింజమూర్, తదితర గ్రామాల్లో మురికికాల్వలు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయలేదు. దీంతో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్వాసన వస్తోంది. ఈగలు, దోమలు ప్రబలి మురుగునీరు నిల్వ ఉండటంతో పలు అంటువ్యాధులు సోకే ప్రమాదం పొంచి ఉంది. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో నెలల తరబడి మురుగునీరు నిల్వ ఉంటుంది. ప్రజలు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో సమస్య పరిష్కారం కావడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్



సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. దేవరకొండ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలోని 205 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.68.78 లక్షల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ఆపదలో ఉండి దరఖాస్తులు చేసుకున్న వారందరికీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సీఎం సహాయనిధి అందజేసి ఆదుకుంటున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, డాక్టర్ వేణుధర్‌రెడ్డి, ముక్కమళ్ల వెంకటయ్యగౌడ్, సతీష్‌రెడ్డి, వేమన్‌రెడ్డి, రాంసింగ్, ఆయా మండలాల తహసీల్దార్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చూసి ఓర్వలేక ఆరోపణలు

చింతపల్లి: అభివృద్ధి చూసి ఓర్వలేక బీఆర్ఎస్, బీజేపీ నాయకులు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలంలోని చాకిలిశేరుపల్లికి చెందిన బూడిద భారతమ్మకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కు శుక్రవారం ఆయన అందజేసి మాట్లాడారు. బీఆర్ఎస్ పదేళ్ల కుటుంబపాలన చేసి ప్రజలను మోసం చేసిందని అన్నారు. అర్హులందరూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్, నాయకులు కేశగోని వెంకటేష్‌గౌడ్, బూడిద సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి పూర్వవిద్యార్థులు తోడ్పడాలి

ఘనంగా అడవిదేవులపల్లి జడ్పీ పాఠశాల పూర్వవిద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న 1991-94 బ్యాచ్ పూర్వవిద్యార్థులతో నాటి ఉపాధ్యాయులు

మిర్యాలగూడ అర్బన్, మే 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేసిన పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న స్కూళ్ల అభివృద్ధికి తోడ్పాటునందించాలని రిటైర్డ్ హెచ్‌ఎంలు డి.లక్ష్మీనారాయణ, వై.నాగేశ్వర్‌రావు అన్నారు. అడవిదేవులపల్లి జడ్పీ హైస్కూల్‌కు చెందిన 1991-94 బ్యాచ్ పూర్వ విద్యార్థులు శుక్రవారం మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత హెచ్‌ఎంలు మాట్లాడుతూ తాము పనిచేసిన పాఠశాలలో విద్యార్థులకు విద్యాభ్యాసంతో పాటు జ్ఞానం, సభ్యత, సంస్కారం నేర్పించామన్నారు. అడవిదేవులపల్లి పాఠశాలలో చదువుకున్న విద్యార్థులు గొప్పగా ఎదగడంతో పాటు ఉన్నతమైన పౌరులుగా జీవిస్తున్నందుకు గర్వంగా ఉందన్నారు. పూర్వవిద్యార్థులు పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పనకు ముందుకు వస్తున్న తీరు అభినందనీయమన్నారు. ఈ హైస్కూల్ నుంచి పదో తరగతి ఫలితాల్లో మొదటిర్యాంకు సాధించిన విద్యార్థికి రూ.1,516, రెండోర్యాంకు వచ్చిన విద్యార్థికి రూ. 1,116 నగదు ప్రోత్సాహంతోపాటు జ్ఞాపిక అందించే కార్యక్రమాన్ని వచ్చే విద్యాసంవత్సరం నుంచి అమలు చేస్తామని లక్ష్మీనారాయణ ప్రకటించారు. పూర్వ విద్యార్థులంతా అసోసియేషన్‌గా ఏర్పడి పేద విద్యార్థులకు చేయూతనిచ్చి ఆదర్శంగా నిలవాలని ఆయన సూచించారు. అనంతరం ముప్పై ఏళ్ల తర్వాత సమ్మేళన వేదికగా కలుసుకున్న 1991-94 బ్యాచ్ పూర్వవిద్యార్థులు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. పాఠశాల స్థాయిలోని మధురస్మృతులను గుర్తు చేసుకొని యోగక్షేమాలు తెలుసుకొని మురిసిపోయారు. కాగా 1991-94 బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు పాఠశాలలో స్టేజీ నిర్మాణం కోసం ఆర్థికసహాయం అందజేస్తామని ప్రకటించారు. తదనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సత్కరించి ఆశీర్వచనం పొందారు. కార్యక్రమంలో రిటైర్డ్ పీఈటీ ప్రభాకర్‌రెడ్డి, పూర్వవిద్యార్థులు వెంపటి కరుణాకర్, గందే ప్రసాద్, చల్లా సాంబశివారెడ్డి, గురవయ్య, నీలకంఠం, సాంబయ్య, శ్రీనివాసచారి, పుష్పలత, సైదయ్య, సుమన్, దస్రునాయక్, నాగానాయక్, హరినాథ్‌రెడ్డి, రామాచారి, విజయలక్ష్మి, లత, శైలజ, లక్ష్మీపార్వతి తదితరులు పాల్గొన్నారు.

కులగణన చేపట్టడం హర్షణీయం

● పీఎం మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



తాటికోలులో మోదీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న రవికుమార్, బాలస్వామి

దేవరకొండ, మే 2(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా జనగణనతో పాటు కులగణన చేపడుతామని ప్రకటించడం హర్షణీయమని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఇడెం రవికుమార్ అన్నారు. దేవరకొండ మండలం తాటికోలులో బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఎన్నో సంవత్సరాలు అధికారంలో ఉన్నా కులగణన చేపట్టకుండా కాలయాపన చేశాయని విమర్శించారు. ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు కడ్తాల బాలస్వామి, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు తిరుపతిగౌడ్, గంజి హరి, కుర్మయ్య, ఆంజనేయులుగౌడ్, ఈదయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో...

దేవరకొండ పట్టణంలో బీసీ సంక్షేమసంఘం ఆధ్వర్యంలో బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య చిత్రపటానికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి చింతపల్లి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీసీల సమస్యల పరిష్కారానికి ఆర్.కృష్ణయ్య గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాటాలు చేశాడని గుర్తుచేశారు. బీసీల సమస్యలను ప్రధాని మోదీ, అమిత్‌షాకు వివరించి జగణనతో పాటు కులగణన ప్రకటించే విధంగా కృషి చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు శ్రీను, భాషానాయక్, బలరాం, తూటుపల్లి శ్రీను, రాములు తదితరులు పాల్గొన్నారు.

రైతులు యూనిక్ ఐడీ నెంబర్లు పొందాలి



రైతునేస్తం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న వ్యవసాయ అధికారులు

మిర్యాలగూడఅర్బన్, మే 2(ఆంధ్రజ్యోతి): రైతులు తమ పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డుకు అనుసంధానమైన ఫోన్ నెంబర్లను వ్యవసాయ విస్తరణ అధికారులకు సమర్పించి యూనిక్‌ఐడీ నెంబర్లు పొందాలని మిర్యాలగూడ మండల వ్యవసాయాధికారి ధీరావత్ సైదానాయక్ కోరారు. పట్టణంలోని రైతువేదిక శుక్రవారం నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమంల అనంతరం ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం నుంచి లభించే పీఎం కిసాన్ యోజన తరదితర సబ్సిడీ పథకాలను పొందేందుకు రైతులకు యూనిక్ ఐడీ నెంబర్ ఉపయోగపడుతుందన్నారు. రైతులకు యూనిక్‌ఐడీ నెంబర్లు జారీ చేయాలని వ్యవసాయశాఖ కమిషనర్ ఆదేశించినట్లు తెలిపారు. దీంతో వ్యవసాయ భూమి కలిగిన ప్రతిరైతు ఏఈవోలను సంప్రదించి యూనిక్ ఐడీ నెంబర్లను తీసుకోవాలని ఏవో కోరారు. ఆయన వెంట ఏవోలు రుషేంద్రమణి, శివరాం, సరిత, కిషోర్‌నాయక్, ఏఈవోలు షఫీ, నితీన్ పాల్గొన్నారు.

కులగణన ఘనత కాంగ్రెస్‌దే



సమావేశంలో మాట్లాడుతున్న నీరుకంటి నారాయణ

మిర్యాలగూడ టౌన్, మే 2(ఆంధ్రజ్యోతి): కులగణన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని ఆ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి నీరుకంటి నారాయణ అన్నారు. హనుమాన్‌పేటలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో సామాజిక అసమానతలు తొలగించేందుకు పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీ జూడో యాత్ర చేపట్టారని, నాడే కులగణనకు డిమాండ్ చేశారని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ సూచించిన విధంగానే బీజేపీ ప్రభుత్వం జనగణనతో పాటు బీసీల కులగణన చేపట్టనుందన్నారు. దేశంలో అమలువుతున్న పలు సంక్షేమ పథకాలు మాజీ ప్రధాని ఇందిరాగాంధీ రచించిన 20 సూత్రాలలోనివేనని అన్నారు. సమావేశంలో నాయకులు కుప్పాల సుబ్బారావు, పసుపులేటి శివ, చెన్నా శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, నాగేంద్రబాబు, వీరన్న పాల్గొన్నారు.

దిక్సూచిగా తెలంగాణ రాష్ట్రం...

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆలోచన మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో చేపట్టిన కులగణన దేశానికే దిక్సూచిగా మారిందని యువజన కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రూపావత్ హరిప్రసాద్ అన్నారు. పట్టణంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం చేపడతున్న జనాభాతో పాటు కులగణన చేపట్టడం శుభసూచమని అన్నారు. కులగణన అంశం కాంగ్రెస్ పార్టీ లేవనెత్తిందేనని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి సారథ్యంలో రాష్ట్రం సంక్షేమ, అభివృద్ధి బాటలో పయనిస్తుందన్నారు. సమావేశంలో రాజునాయక్, పవన్, శివ, నాగరాజు, సతీష్, రమేష్ తదిరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



హెచ్‌ఎం శేషును సన్మానిస్తున్న ఎంఈవో రాములు, సిబ్బంది

నాగార్జునసాగర్, మే 2(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఫలితాల్లో నూటికి నూరు శాతం సాధించడం అభినందనీయమని ఎంఈవో తరి రాములు అన్నారు. ఎస్వీఆర్ మోడల్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యనభ్యసించిన 46 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు నాణ్యమైన, విలువలతో కూడి విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం నూరుశాతం ఉత్తీర్ణత సాధించినందుకు కృషి చేసిన హైస్కూల్ హెచ్‌ఎం శేషును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పైలాన్ యూపీఎస్ హెచ్‌ఎం సహదేవి, ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం గగనేశ్వరీ, సీఆర్పీ రమ్య తదితరులు పాల్గొన్నారు.